జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి | శనివారం 20 జూన్ 2026 | సంపుటి : 16 | సంచిక : 328 | పేజీలు : 8 | వెల : 1/- | RNI NO.APTEL/2010/36516

తేదీ : 20 జూన్ 2026, శనివారం / స్థిర వాసరః సంవత్సరం: శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం: జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, ప్రత్యేకత : ప్రపంచ శరణార్థుల దినోత్సవం / సూర్యోదయం : 5:27 సూర్యాస్తమయం : 6:31, చంద్రోదయం : 10:32 , చంద్రాస్తమయం : 11:14 , పంచాంగం: తిథి : శుద్ధ షష్ఠి రా. 8:56 వరకు, తర్వాత సప్తమి, నక్షత్రం : మఖ మ. 2:52 వరకు, తర్వాత పుబ్బ, యోగం : వజ్రం సా. 6:24 వరకు, తర్వాత సిద్ధి, కరణం: కౌలవ ఉ. 9:37 వరకు, తర్వాత తైతుల రా. 8:56 వరకు, తర్వాత గరజి

Published From RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA | http://www.prajajyothinews.com | Mail : prajajyothidaily@gmail.com

## మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా మెగా ఇంటీరియర్

# డిజైన్ షో ప్రారంభం



**శేరిలింగంపల్లి,జూన్ 19 (ప్రజాజ్యోతి):**

ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్, నిర్మాణ రంగాలలో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక ద్వైవార్షిక ప్రదర్శన 'ఐఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 2026'ను నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ కేవలం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో ఒకటి మాత్రమే కాదని, అవకాశాలు, జీవనశైలి, ఆవిష్కరణలు కలిసే ఒక గ్లోబల్ గమ్యస్థానంగా ఎదుగుతుందన్నారు. ఐఐఐడీ షోకేస్ అనేది సరికొత్త ఇంటీరియర్ ఉత్పత్తులు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, గ్లోబల్ డిజైన్ ట్రెండ్‌లను ఒకే చోటకు తెచ్చే ఒక శక్తివంతమైన వేదికగా నిలుస్తుందన్నారు. ఇది కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాదని, నిర్మాణ రంగ సౌందర్యాన్ని, పని తీరును, స్థిరత్వాన్ని పెంపొందించడానికి ఒక ఉత్ప్రేరకం లాంటిదన్నారు. ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లు, డెవలపర్లు, బిల్డర్లు, ఇళ్ల యజమానులకు కూడా ఒక అవగాహనను అందిస్తుందన్నారు. ఈ పరిశ్రమ ఎటు వైపు వెళ్లుంది? ప్రపంచంలోని ప్రముఖ నగరాల సరసన హైదరాబాద్ తనను తాను ఎలా నిలుపుకుంటోంది అని తెలుసుకోవాలనుకునే వారెవ్వరూ ఈ ఈవెంట్‌ను మిస్ కావద్దన్నారు. - మిగతా 2లో

# 87 కోట్ల విలువైన సీఆర్ఎఫ్ రోడ్ల అభివృద్ధి

### జిల్లాలో రోడ్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

### తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు గేమ్ ఛేంజర్‌గా మారనున్నాయి

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం జూన్ 19 ప్రజాజ్యోతి:**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో చేపట్టిన, పూర్తయిన సుమారు రూ. 87 కోట్ల విలువైన సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (జ=ఖీ) రోడ్ల పనులకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డితో కలిసి శుక్రవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ... తిమ్మాపూర్ గ్రామానికి వివిధ ప్రాంతాలతో మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో సుమారు రూ. 100 కోట్ల వ్యయంతో పలు రహదారి నిర్మాణ పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. కొంగర, రావిరాల, శ్రీశైలం రోడ్డు, లాచునూరు, అవరమియగూడెం, జబార్‌గూడ, ఎలిమినేడు, కప్పాడు, తుర్కగూడెం, చర్లపటేల్‌గూడెం, ఇబ్రహీంపట్నం రోడ్డు, గుమ్మడవెల్లి, మీర్‌ఖాన్‌పేట, కుర్మిద్ద తదితర ప్రాంతాలకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా మాదాపూర్, బేగంపేట్ ప్రాంతాలతో కూడా కనెక్టివిటీ పెంచే దిశగా చర్యలు - మిగతా 2లో

## నిరుపేద అనాథ ఆడపిల్లలకు

# అండగా ఉప్పల ఆశ్రమం

### రూ,10 కోట్లతో నూతనంగా నిర్మించిన ఉప్పల ఆశ్రమ పాఠశాల

### రాష్ట్ర స్థాయిలో ఉప్పల వేంకటేశ్ పై ప్రశంసల జల్లులు

### ఘనంగా ఉప్పల ఆశ్రమ పాఠశాల ప్రారంభోత్సవ వేడుకలు.

### ముఖ్య అతిథులుగా హాజరైన,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లు



**తలకొండపల్లి,జూన్ 19(ప్రజాజ్యోతి)**

ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా అనాథ బాలికలకు,నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉప్పల ఆశ్రమ పాఠశాల ద్వారా ఉచితంగా అందించడం అభినందనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లు అన్నారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి ఎక్స్ రోడ్డు చౌరస్తాలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో రూ,10 కోట్లను ఖర్చు చేసి ఆధునిక సౌకర్యాలతో పేద బాలికలకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఉప్పల ఆశ్రమ పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,మాజీ - మిగతా 2లో

## నిజాయితీతో కూడిన

# ఆలోచనలకు మద్దతు

### ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

### 'ఒకే సిటీ, ఒకే విజన్, అపార అవకాశాలు' అనే నినాదంతో హైదరాబాద్ ఎకనామిక్ ఫోరమ్

### ఐదు వందల మందికి పైగా హాజరు




**శేరిలింగంపల్లి,జూన్ 19 (ప్రజాజ్యోతి):**

నిజాయితీతో కూడిన ఆలోచనలకు మద్దతు అందించనున్నామని ముఖ్య అతిథి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు తెలిపారు. ప్రపంచంలోని అగ్రగామి ఆర్థిక, ఆవిష్కరణల హబ్‌లలో ఒకటిగా నగరాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఖాజాగూడలోని ఎస్ఏఎస్ ఐటవర్లో మొట్టమొదటి 'హైదరాబాద్ ఎకనామిక్ ఫోరమ్ 2026' నిర్వహించారు. 'ఒకే సిటీ, ఒకే విజన్, అపార అవకాశాలు' అనే నినాదంతో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సరికొత్త ఆలోచనలతో తెలంగాణకు రండి. ప్రతి ఆలోచన విజయవంతమవుతుందని గ్యారెంటీ ఇవ్వలేకపోవచ్చు, కానీ నిజాయితీతో కూడిన ప్రతి ఆలోచనకు ఇక్కడ మద్దతు, అవకాశం, ఎదిగేందుకు కావాల్సిన నమ్మకం లభిస్తాయని హామీ ఇవ్వగలం' అని చెప్పారు. 20వ శతాబ్దం వనరులు, పరిశ్రమలు, పెట్టుబడుల కోసం పోటీ పడేవని, కానీ 21వ శతాబ్దం సరికొత్త ఆలోచనలు, ప్రతిభ, ఆవిష్కరణలను ఆకర్షించగల దేశాలదేనని అన్నారు. గత దశాబ్ద కాలంలో గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ లో భారతదేశం 81వ స్థానం నుంచి 39వ స్థానానికి చేరడం, అద్భుతమైన వృద్ధిని సాధించడం ఈ ప్రపంచ మార్పును ప్రతిబింబిస్తోందని తెలిపారు. దేశంలో పెరుగుతున్న ఆవిష్కరణల సామర్థ్యాన్ని ఇది చెప్తుందన్నారు. ఈ పరివర్తనను ముందుండి నడిపించేందుకు తెలంగాణ దృఢ నిశ్చయంతో ఉందని చెప్పారు. ఈ రోజు భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ 'స్టేట్స్ స్టార్టప్ ర్యాంకింగ్స్'లో తెలంగాణ అత్యంత డైనమిక్ ఇన్నోవేషన్ హబ్‌లలో ఒకటిగా అవతరించిందన్నారు. టాప్ పెర్ఫార్మర్'గా గుర్తింపు పొందిందని తెలిపారు. ఐకామ్, తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్, స్టార్టప్‌ల కోసం రూ. 1,000 కోట్ల ఫండ్ ఆఫ్ ఫండ్స్, ప్రతిపాదిత ఏఐ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ, 100 అడ్వాన్స్‌డ్ ఐటీఐల వంటి - మిగతా 2లో

# ఘనంగా డ్రై డే ఫ్రైడే కార్యక్రమం విజయవంతంగా నిర్వహణ





**బషీరాబాద్ జూన్ 19 ప్రజా జ్యోతి** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డిఎం హెచ్ ఓ డాక్టర్ సుధాకర్ లాల్ ఆదేశాల మేరకు శుక్రవారం వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్ సి )నవల్గా పరిధిలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని డాక్టర్ శ్రీకాంత్ గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంలో డాక్టర్ శ్రీకాంత్ గుప్తా మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటికి వెళ్లి నీరు నిల్వ ఉండే పాత్రలు కూలర్లు, టైర్లు, కొబ్బరి, చిప్పులు, పూల కుండీలు, వాటర్ ట్యాంకులు, ఇతర వస్తువులు పరిశీలించి దోమల ద్వారా నిర్మూలన చర్యలు చేపట్టమని అన్నారు. ప్రజలకు డెంగు చికెన్ గున్య మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారణ పై అవగాహన కల్పించాము.

**డ్రై డే ఫ్రైడే కార్యక్రమం వల్ల కలిగే ప్రయోజనాలు**

లిదోమల సంతోన్నత్పత్తి కేంద్రాలను నిర్మూలించవచ్చు

లిడెంగ్యూ చికెన్ గున్యా మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తిని అరికట్టవచ్చు

లిపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యం మైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుంది.

లిప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెరుగుతుంది

లికుటుంబ సభ్యులు వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందుతారు.



ఈ సందర్భంగా ప్రతి ఇంటి యజమాని ప్రతి శుక్రవారం కనీసం 10 నిమిషాల పాటు ఇంటి పరిసరాలను పరిశీలించి నీరు నిల్వ ఉంచకుండా చర్యలు తీసుకోవాలని కోరడమైనది పది నిమిషాలు ప్రతి శుక్రవారం దోమలు చెక్ అనే నినాదంతో ప్రజలందరూ బాగుస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేయడమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలి

**సర్పంచ్ సీమ సుల్తాన్**



**బషీరాబాద్ జూన్ 19 ప్రజా జ్యోతి** గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ప్రభుత్వ భూములను ఎట్టి పరిస్థితిలోనూ ఆక్రమించవద్దని మైల్వార్ గ్రామ సర్పంచ్ సీమ సుల్తాన్ సూచించారు. ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ గ్రామంలో 235 సర్వే నెంబర్ లో ప్రభుత్వ భూమిలో ఎవరైనా కొత్తగా కంపలు వేయడం ఎరువులు వేయడం దొడ్లు నిర్మించడం అక్రమానికి ప్రయత్నించడం ఏ విధమైన కబ్జాకు పాల్పడడం చట్ట విరుద్ధమని అన్నారు.ప్రభుత్వం చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే స్థలాలు కేటాయింపు ఉంటుందని సృష్టించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా కొత్తగా ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు గ్రామ ప్రజలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించి ప్రభుత్వము ఆస్తులను పరిరక్షించాలని ఆమె కోరారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా న్యాయం జరిగేలా గ్రామపంచాయతీ కృషి చేస్తుందని అన్నారు.

# కన్మన్ కల్వ పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం

**చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాపలపల్లి శేఖర్**





**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) జూన్ 19 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్ర పరిధిలోని కన్మన్ కల్వ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా చౌడాపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేఖర్ మాట్లాడుతూ.ప్రభుత్వ విద్యకు కొత్త పరిణామం కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో ప్రభుత్వ విద్య డిజిటల్ క్లాసులు,క్రీడా, వసతులు, బ్రేకపాస్ట్, భోజనం,రవాణా సౌకర్యం తోపాటు అనేక అభివృద్ధికి ముందుకు వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పండుగ కృష్ణవేణి రాజు,చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాపలపల్లి శేఖర్ మాజీ అధ్యక్షులు అశోక్ కుమార్,ఏ ఏపీ చైర్మన్ బేగం,ఉప సర్పంచ్ మనమ్మ వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాము,మాజీ ఎంపీటీసీ అంబి బాయ్,రాములు గ్రామ పెద్దలు ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి హెడ్ మాస్టర్ రమేష్ మరియు ఉపాధ్యాయ బృందం,కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఖాదర్,మల్లేష్,శ్రీకాంత్,సుదర్శన్,అంజి,కృష్ణ,రమేష్,ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పండుగ నరసింహులు మరియు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్వర్ గౌడ్**



**కూకట్ పల్లి, జూన్ 19 (ప్రజా జ్యోతి) :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన శుభసందర్భంగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆయన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, పాండుగౌడ్, పోశెట్టిగౌడ్, భాస్కర్, షౌకత్ ఆలీ మున్నా, రాందాస్ గౌడ్, మల్లేష్, అరుణ, యాదగిరి, రవీందర్, మహేష్, ఖలీమ్, నాగరాజు, వెంకటేష్, కటిక రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్లలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**- రాహుల్ గాంధీ సేవా స్ఫూర్తి ఆదర్శం**

**- మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి**



**చేవెళ్ల, జూన్ 19:(ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను చేవెళ్ల మున్సిపల్ పరిధిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం పాటుపడుతున్న నాయకుడని అన్నారు. యువత, రైతులు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల సమస్యలపై ఆయన నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్నారు. దేశ సేవలో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ చేసిన త్యాగాలు స్ఫూర్తిదాయకమని, అదే మార్గంలో రాహుల్ గాంధీ ప్రజాసేవను కొనసాగిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ, అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ఆయన లక్ష్యమని అన్నారు. రాహుల్ గాంధీ సేవ స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనే ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, కౌన్సిలర్లు కృష్ణా నాయక్, మద్దెల శ్రీనివాస్, మాజీ సర్పంచులు పడాల ప్రభాకర్, రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, మల్గారి మల్లారెడ్డి, నడిముల్ల శంకర్, అత్తిలి రవీందర్ రెడ్డి, ఖదీర్ పాషా, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ లియాకత్, అబ్దుల్ గని, మహేష్ కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలిని దేశ ప్రజల ఆకాంక్ష..పాపిరెడ్డి నగర్ అధ్యక్షులు చంద్రారెడ్డి



**కూకట్ పల్లి, జూన్ 19 (ప్రజా జ్యోతి) :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చూడాలన్నా భారత దేశ ప్రజల ఆకాంక్ష త్వరలో నెరవేర బోతుందని పాపిరెడ్డినగర్ బస్తి అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉట్ల చంద్ర రెడ్డి కార్యాలయంలో కేకును కుట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు జీ. బి. కన్నారావు, వనం ఆంజనేయులు, పద్మ కేశవులు, కె.యాదగిరి ,దాకూరి తిరుపతిరెడ్డి, పండు గౌడ్, లక్ష్మణ్, జగన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అర్హులకు న్యాయం చేకూర్చట్లేదు

**అభయ హస్తం పేరిట దళితులకు 12 లక్షల ఇస్తామని హామీని వెంటనే అమలు పరచాలి**

**కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**కూకట్ పల్లి, జూన్ 19 (ప్రజా జ్యోతి) :** కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలో గల ఎస్సీ సామాజిక వర్గ సభ్యులు శుక్రవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యంగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన లోన్లకు సంబంధించి ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు సబ్సిడీ లోన్లు ఇచ్చిన వారికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు అర్హులవుతారా లేదా అన్న విషయం స్పష్టంగా ప్రజలకు తెలియపరచాలని అధికారులకు తెలియజేశారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ సామాజిక వర్గానికి చెందాల్సిన లోన్లను అర్హులకి అందించడం లేదని తమకు తగి న్యాయం చేసే విధంగా చూడాలని ప్రజలు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంబంధిత అధికారులతో మాట్లాడి ఎవరైతే అర్హులు ఉంటారో వారికి కచ్చితంగా లోన్లు అందేలా.. అలాగే బిఆర్ఎస్ ప్రభుత్వంలో అర్హులకు దళిత బంధు ఏవిధంగా ఇచ్చాము ఇప్పుడు కూడా అర్హులకు అందాల్సిన బాధ్యత ఉందని తెలియజేశారు. ముఖ్యంగా ఈ విషయంపై ప్రజలకు స్పష్టంగా వివరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలియజేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభయ హస్తం పేరిట దళితులకు 12 లక్షల ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇది కూడా తక్షణమే అమలు చేసేటట్టు చూడాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల ప్రభాకర్, నపారి చంద్రశేఖర్, బొట్టు విష్ణు, ఎడ్ల కవిత, నర్సింగ్ రావు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొత్లాపూర్ పాఠశాలలో పుస్తకాల పంపిణీ

**-చదువుకుంటేనే మీకు బంగారు భవిష్యత్తు**

**-గ్రామ సర్పంచ్ చంద్రకళ**



**తాండూరు జూన్ 19 ప్రజా జ్యోతి :-** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కొత్లా పూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు రాత పుస్తకాలను గ్రామ సర్పంచ్ చంద్రకళ అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధానోపాధ్యాయుడు జొన్నల వినోద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి గ్రామ సర్పంచ్ చంద్రకళ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పిల్లలకు మంచి చదువును అందించడంతోపాటు వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేయాలన్న లక్ష్యంతో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు రాత పుస్తకాలతో పాటు రెండు జతల బట్టలను కూడా ప్రభుత్వం అందజేయడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలోనే మంచి విద్య తోపాటు క్రమశిక్షణ వంటివి పొందే అవకాశం ఉందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్న నానుడి నిదానం నినాదాన్ని నిజం చేసే విధంగా ప్రతి తల్లిదండ్రి కృషి చేయాలని గుర్తు చేశారు. పాఠశాలలో ఓ మంచి క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయ బృందం ఉండడం కూడా అదృష్టం అన్నారు. విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాల కోసం తన వంతు సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

# శుభోదయ కాలనీలో డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



**కూకట్‌పల్లి, జూన్ 19 (ప్రజా జ్యోతి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీలో ఉన్న పలు డ్రైనేజీ సమస్యలను శేరిలింగంపల్లి శాసన సభ్యులు పి.ఎ.సి. చైర్మన్, అరెకపూడి గాంధీ ఆదేశాల మేరకు స్థానిక మాజీ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు శుక్రవారం అధికారుల బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలనీలో డ్రైనేజీ లైన్ నిలిచిపోవడం, పొంగిపొర్లడం వంటి సమస్యలపై స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆయన తక్షణమే స్పందించారు. ఈ పర్యటనలో జలమండలి మేనేజర్ ప్రకాష్ విలియమ్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, వారి సాంకేతిక సిబ్బందితో కలిసి మాజీ కార్పొరేటర్ కాలనీలోని ప్రతి వీధిని తిరుగుతూ సమస్యలను స్వయంగా పరిశీలించారు. డ్రైనేజీ లైన్ల పూడికతీత, లీకేజీల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ అధికారులను ఈ సందర్భంగా ఆయన సూచించారు. స్పందించిన అధికారులు సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని, సమస్యలపై స్పందించి స్వయంగా పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# యువతే దేశ భవిష్యత్.. రాహుల్ గాంధీ లక్ష్యం అదే : ఎమ్మెల్యే శ్రీగణేష్

.రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు



**బోయిన్ పల్లి, జూన్ 19. (ప్రజా జ్యోతి) :** లోక్‌సభ ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్ పికెట్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా వేడుకలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ దేశ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే రాహుల్ గాంధీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నిరుద్యోగం, పేపర్ లీకేజీల కారణంగా యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల కల్పనకు విధానాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీ మరింత ప్రజాసేవ చేయాలని, ఆయనకు దీర్ఘాయుష్షు, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు. బీజేపీ ప్రభుత్వం పెత్తందారులకే పరిమితమైందని, సామాన్యులు, రైతులు, యువత కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయంతో కూడిన భారతదేశ నిర్మాణం జరుగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ జన్మదిన వేడుకల్లో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్‌లో జాతీయ స్థాయి సత్తా చాటిన గౌతమ్ నాయక్

శాలువాతో ఘనంగా సన్మానించిన మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్

హాజరైన ఈట గణేష్, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,బాతుక దేవేందర్ యాదవ్,ఎమ్మె సత్యనారాయణ



**కొత్తూర్ జూన్ 19 (ప్రజా జ్యోతి)** జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఆల్ ఇండియా ఎస్టీ కేటగిరీలో 73వ ర్యాంకు సాధించి కొత్తూరు ప్రాంతానికి గుర్తింపు తీసుకొచ్చిన గౌతమ్ నాయక్‌ను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, నాయకులు ఈట గణేష్,కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,బాతుక దేవేందర్ యాదవ్ ఎమ్మె సత్యనారాయణ హాజరై ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ..బిఆర్ఎస్ పార్టీ నాయకుడు రవి నాయక్ కుమారుడైన గౌతమ్ నాయక్ సాధించిన ఈ అద్భుత విజయంపై వారు హర్షం వ్యక్తం శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేస్తూ, కష్టపడి చదివితే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో రాణించగలరని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. గౌతమ్ నాయక్ సాధించిన ర్యాంకు కొత్తూరు మండలానికి గర్వకారణమని,భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు,విద్యార్థులు, కుటుంబ సభ్యులు గౌతమ్ నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గౌతమ్ నాయక్ మాట్లాడుతూ..మాట్లాడుతూ.. నిరంతరం శ్రమించడం వల్లే జేఈఈ- అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంకు సాదించడానికి ద్రోహదపడిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ వైస్ చైర్మన్ డోలి రవీందర్,తాజా మాజీ కౌన్సిలర్స్ కోస్గి శ్రీనివాస్,చంద్రకళ రాజేందర్ గౌడ్,అనిత శ్రీనివాస్ గౌడ్,గూడూరు మాజీ సర్పంచ్ బ్యాగరి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట'తో సర్కారు చదువులకు ఊపు

సిద్దాపూర్ సర్పంచ్ బాసు నాయక్

చింత గట్టు తాండలో విస్తృతంగా బడిబాట కార్యక్రమం





**కొత్తూర్ జూన్ 19 (ప్రజా జ్యోతి)** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సిద్దాపూర్ సర్పంచ్ బాసు నాయక్ అన్నారు. కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చింతగట్టు తాండలో సర్పంచ్ బాసు నాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామ పంచాయతీలో తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాల ఉండే విధంగా చర్యలు తీసుకొని పేద,మధ్య తరగతి తల్లిదండ్రులపై ఆర్థికభారం పడకుండా చూసేందుకు ఈ కార్యక్రమం చేపట్టిందని సర్పంచ్ బాసు నాయక్ సూచించారు. విద్యార్థులకు 21 రకాల వస్తువులతో కిట్లు అందజేయబడతాయని ఆయన తెలిపారు. అలాగే ఉదయం టిఫిన్,మధ్యాహ్నం భోజనం గుడ్లు,రాగి జావ,పాలు వంటి పోషకాహారం అందించడంతో పాటు నాణ్యమైన విద్య అందించబడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దోబ్బల యాదయ్య, గ్రామ పంచాయతీ సెక్రెటరీ కుమార్,ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య,అంగన్వాడీ టీచర్స్ సునీత,నాయకులు వెంకట్, మహిపాల్,తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరులో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

కొత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రెడ్లు,పండ్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు





**కొత్తూర్ జూన్ 19 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ కోశాధికారి చింత సాయి తేజేశ్వర్ ఆధ్వర్యంలో కొత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు,పండ్లు కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జగన్,మాజీ వార్డ్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆంజనేయులు గౌడ్, పెద్దిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, నరసింహ గౌడ్,హస్సేన్,సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి

**మాజీ కార్పొరేటర్,బిజెపి రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి**

**మైలార్దేవుపల్లి డివిజన్ వాంబే కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్న తోకల శ్రీనివాస్ రెడ్డి**





**రాజేంద్రనగర్, జూన్ 19 (ప్రజా జ్యోతి)** డివిజన్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని మాజీ కార్పొరేటర్, రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి తోకల శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్దేవుపల్లి డివిజన్ వాంబే కాలనీ స్థానికుల విజ్ఞప్తి మేరకు బస్తీ లోని సమస్యలపై రాజీవ్ గృహకల్ప క్వాటర్స్ లోని స్థానిక సమస్యలపై ప్రధానంగా వేసవి కాలం కారణంగా నీటి సమస్యల ఉందని స్థానికులు రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్,మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డికి తెలపడంతో దానికి సంబంధించిన సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధించిన వారిని ఫోన్ లో మాట్లాడారు. అదే విధంగా భూగర్భ డ్రైనేజ్ వ్యవస్త దెబ్బతిన పైప్ లైన్ అదే విధంగా పైన బాల్కనీ మరమ్మతు సమస్యల పై అధికారులతో మాట్లాడి త్వరగా సమస్యలను సమస్య పరిష్కారం అయ్యేవిదంగా చూస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. బస్తీ లోని స్థానిక నాయకులను ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని తెలియజేశారు. ప్రజలు తమ ఇంటి పరిసరలలో చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చి రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికే జనార్ధన్, సంతు గౌడ్, తలారి చిన్న, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మీ గారు శోభ గారు బబ్లూ, పృథ్వీ రాజ్, అరుణ్ మజర్ భాయ్, ఎన్ను శంకర్ రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ గర్భిణీ స్త్రీలకు అవసరమైన సేవలు అందించేందుకు ఫౌండేషన్ చేయూత

కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ విజయలక్ష్మి యాదవ్



**యాలాల :(జూన్ 19) ప్రజా జ్యోతి** మండలం పరిధిలోని హాజీపూర్ గ్రామాలలో కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు "మాతృక శక్తి శ్రీమంతం కానుక" కిట్లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ కంజర్ల విజయలక్ష్మి స్వయంగా ముఖ్య అతిథిగా హాజరై గ్రామంలోని గర్భిణీ మహిళలకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ విజయక్క మాట్లాడుతూ,గర్భిణీ స్త్రీలకు చీరలు,గాజులు,పోషకాహార వస్తువులు అవసరమైన ఇతర సామగ్రిని అందించడం ద్వారా వారికి అండగా నిలవడం తమ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమన్నారు. సమాజంలో ఆడపిల్ల పెళ్లి తర్వాత జరిగే శ్రీమంతం ఒక ప్రత్యేకమైన పండుగ అని, మాతృత్వ సమయంలో మహిళలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మాజీ జిల్లా కోషన్స్ సంఘం అధ్యక్షులు అక్బర్ బాబా, దిలీప్ కుమార్,క్రాంతి అనిల్ కుమార్ గౌడ్,జగదీష్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రన్నీ ఆకస్మిక తనిఖీ చేసిన డి.ఎమ్.హెచ్.వో



**ధారూర్, జూన్ 19 ( ప్రజా జ్యోతి ):** జీవన శైలి వ్యాధుల బారిన పడిన వారిన వెంటనే పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుధాకర్ లాల్ అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని నాగసముందర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రన్నీ ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవల గురించి ఆయన ఆరా తీశారు. జీవన శైలి వ్యాధుల బారిన పడిన వారికి పరీక్షలు నిర్వహించి మందులు సకాలంలో అందించాలని వైద్యాధికారి డాక్టర్ జ్యోతిని ఆదేశించారు. ఈ నెల 28 వ తేదీ నుండి జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

# కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు




**కూకట్ పల్లి, జూన్ 19 (ప్రజా జ్యోతి) :** రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీ హేమ దుర్గా భవన్ లో శుక్రవారం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత సాధికారత కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషిని నాయకులు కొనియాడారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, రాహుల్ గాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, సేవాదళ్ నాయకులు, సోషల్ మీడియా, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేసారు. రాహుల్ గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ నాయకులు ప్రజాసేవ పట్ల ఆయన నిబద్ధత స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# బాధితుడిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి





**ఆవులకు విషం ఇచ్చిన నిందితులను కఠినంగా శిక్షించాలి**

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

**కుమ్మరిగూడెంలో రైతు రఘునందన్ ను ఓదార్చిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

**కొత్తూర్ జూన్ 19 (ప్రజా జ్యోతి)** కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడకు రైతు రఘునందన్ కు చెందిన 08 ఆవుల మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. షెడ్ లో బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి వారు ముర్కుల దాన మరియు పత్తి చెక్కలో అత్యంత నిర్లక్ష్యంగా యూరియా కలిపి, అక్కడి నుండి పరారయ్యారు. శుక్రవారం ఉదయం దానాలో యూరియా కలిసిన సంగతి గమనించని యజమాని రఘునందన్ ఎప్పటిలాగే ఆవులకు ఆ మేతను వేశాడు. ఆ దానా తిన్న కొద్దిసేపటికే ఆవులు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. ఊపిరాడక ఒకదాని తర్వాత ఒకటి విలవిలలాడుతూ కిందపడిపోయాయి. ఈ ప్రమాదంలో మొత్తం 8 ఆవులు, ఒక దూడ అక్కడికక్కడే మరణించినట్లు రైతు రఘునందన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, కౌన్సిలర్స్ కోస్గి శ్రీనివాస్, చంద్రకళ రాజేందర్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు రవి నాయక్, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం





**---రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**శంషాబాద్ మండలం చౌదర్ గూడ గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనానికి స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్, జూన్ 19 (ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో విద్యారంగంలో సమూలమైన మార్పులు చేసేందుకు చేపట్టిన తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనానికి రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం చౌదర్ గూడా గ్రామంలో కేటాయించడంతో శుక్రవారం రెవెన్యూ, విద్యాశాఖ, పంచాయతీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ భూమిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక తెలంగాణ రాష్ట్రంలో నిర్ధారంగంలో విప్లవత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. గత రెండు రోజుల క్రితం ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూలును ప్రైవేట్ స్కూలుకు దీటుగా ఏమాత్రం తీసిపో ఏ విధంగా కాకుండా అన్ని రంగులతో ప్రారంభించడం జరిగిందన్నారు. అదేవిధంగా చౌదర్ గూడ గ్రామంలో తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణానికి 20 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించడం జరిగిందన్నారు. అతి త్వరలో భవనానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. నూతనంగా నిర్మిస్తున్న తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు మెయిన్ రోడ్డు నుండి నేరుగా రోడ్డు వేసే విధంగా సర్వే నిర్వహించాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం సన్నబియ్యంతో మధ్యాహ్నం భోజ పథకంతో పాటు సాయంత్రం టీ స్నాక్స్ కూడా అందించడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా ప్రతి ఒక్క విద్యార్థి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫామ్, స్కూల్ బెల్ట్, టై కూడా అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ తహసిల్దార్ అమర్ లింగం గౌడ్, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, శంషాబాద్ సిఐ నరేందర్ రెడ్డి, సర్పంచులు మల్చలం లక్ష్మి లింగం, గడ్డం శేఖర్ యాదవ్, ఎలుగని ప్రభాకర్ గౌడ్, పిఎసిఎస్ చైర్మెన్ దవనాకర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, శంషాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, నాయకులు గణేష్ గుప్త, దండు ఇస్తారి, కొత్త యాదగిరి రెడ్డి, రమేష్ యాదవ్, రవి, నీరటీ మహేష్, మల్లికార్జున్, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్, శివాజీ, నీళ్ళ శ్రీధర్ గౌడ్, జురికి రమేష్, మల్లేష్, నీరటీ శేఖర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# 70 ఏళ్ల నుండి సాగు చేసి జీవిస్తున్నాం





**ఉన్నపలంగా భూమి తీసుకుంటే రోడ్డున పడతాం**

**భూమికి భూమి ఇచ్చి భూమి స్వాధీనం చేసుకోవాలి**

**-- చౌదరి గూడ రైతులు**

**తమకు న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు వినతిపత్రం అందించిన చౌదరిగుడ గ్రామ రైతులు**

**అధికారులతో చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చేస్తాం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్, జూన్ 19 (ప్రజా జ్యోతి)** చౌదర్ గూడా గ్రామంలో గత 70 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం చేసుకునేందుకు పేద ప్రజలకు భూములు పంచిందన్నారు. ఇప్పుడు అధికారులు వచ్చి మీ భూములు తీసుకుంటాం ఇక్కడ స్కూల్ భవనం నిర్మిస్తాం అంటే తాము ఎక్కడ పోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం చౌదర్ గూడా గ్రామంలో సర్వేనెంబర్ 21 లో ప్రభుత్వ భూమి ఉంది అందులో తెలంగాణ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూల్లో కట్టెందుకు 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. ఈ సందర్భంగా రామచంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శుక్రవారం రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యాశాఖ అధికారులతో కలిసి ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు కేటాయించిన ప్రభుత్వ భూమిని పరిశీలించడానికి వచ్చారు. అక్కడ ఉన్న రైతులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు తమకు న్యాయం చేయాలంటూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాల నుండి వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నామని ఇప్పుడు భూమిని తీసుకుంటామంటే మేము ఎక్కడ వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధికి తాము అడ్డంకి కాదని మా దగ్గర తీసుకున్న భూమికి బదులు భూమి ఇచ్చి భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. ఒకవేళ ప్రభుత్వం బలవంతంగా భూమిని స్వాధీనం చేసుకుంటే 20 కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఇప్పటికైనా అధికారులు పునరాలోచించి తమకు భూమి కేటాయించి భూమి తీసుకోవాలని సూచించారు. తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రైతులు మోర పెట్టుకోవడంతో ఆయన స్పందిస్తూ వెంటనే తహసిల్దార్ అమర్ లింగం గౌడ్ ను పిలిపించి రైతులకు ఇబ్బందులు కలవకుండా పూర్తి వివరాలు తీసుకోవాలన్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**హైదరాబాద్, జూన్ 19 (ప్రజా జ్యోతి) :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆకక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన సంరక్షకులు ఎం.వేద కుమార్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ ప్రార్థనా మణికొండ నిర్వహించగా, ప్రముఖ యోగా స్టార్ క్యాంపెయినర్, యోగా గురువు రాంబాబు విద్యార్థులకు యోగా సాధనపై అవగాహన కల్పించారు. రాంబాబు మాట్లాడుతూ యోగా భారతదేశపు ప్రాచీన సాంస్కృతిక వారసత్వమని, ఇది శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వివిధ యోగా ఆసనాలు, ముద్రలను ప్రదర్శించి వాటి ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. యోగా ద్వారా ఆత్మజ్ఞానం, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, మానసిక క్రమశిక్షణ పెంపొందుతాయని పేర్కొన్నారు. డైరెక్టర్ ప్రార్థనా మణికొండ మాట్లాడుతూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. యోగా సాధన వల్ల ఆరోగ్యం మెరుగు పడటంతో పాటు ఏకాగ్రత పెరిగి, ఒత్తిడి తగ్గి, భావోద్వేగ సమతుల్యత, క్రమశిక్షణ పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, డీన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాలా కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

**- ఆకృతి కన్స్ట్రక్షన్ పై ఎమ్మార్వో కు ఫిర్యాదు**



**శేరిలింగంపల్లి,జూన్ 19 (ప్రజాజ్యోతి):** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి సర్వే నెం. 21లో గల ప్రభుత్వ భూమిలో ఆకృతి కన్స్ట్రక్షన్ అనే నిర్మాణ సంస్థ నాలాను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న విషయమై కఠిన చర్యలు తీసుకోవాలని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి శేరిలింగంపల్లి ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఒకవైపు ప్రభుత్వ భూములను, చెరువులను, నాలాలను పరిరక్షిస్తామని ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం అక్రమ ఆక్రమణలు నిరంతరం కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా, గ్రామ ప్రజలకు ఎంతో ముఖ్యమైన శ్మశానవాటిక ప్రాంతాన్ని, చెరువు నీటి ప్రవాహానికి ఉపయోగపడే సహజ నాలాను కూడా కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. నాలా ఆక్రమణల కారణంగా భవిష్యత్తులో భారీ వర్షాల సమయంలో వరద ముప్పు ఏర్పడి పరిసర కాలనీలు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని తెలిపారు. చెరువులకు నీటి ప్రవాహ మార్గాలు మూసివేయబడటం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, భూగర్భ జలాలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. అధికారులు వెంటనే స్థల పరిశీలన నిర్వహించి, ప్రభుత్వ భూమి, నాలా, శ్మశానవాటికపై జరిగిన ఆక్రమణలను తొలగించి అసలు స్థితిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అమలు చేయాలని కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో గ్రామస్తులు మరియు స్థానిక ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని గంగాధర్ రెడ్డి హెచ్చరించారు.

## సాయికుమార్ కేసులో న్యాయం కోసం పోరాటం

**నెల రోజులైనా చర్యలు లేవంటూ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన ఎమ్మార్పీఎస్**



**చేవెళ్ల, జూన్ 19(ప్రజా జ్యోతి):** కనక మామిడి వ్యాస్ ఫామ్‌హౌస్‌లో అనుమానాస్పదంగా మృతి చెందిన మసీద్ బండ వాసి కొడిచర్ల సాయికుమార్ కేసులో దర్యాప్తు ఆలస్యంపై ఎమ్మార్పీఎస్ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. గత నెల 17న జరిగిన ఘటనకు సంబంధించి నెల రోజులు గడిచినా నిందితుల అరెస్టు జరగలేదని, కేసు విచారణలో పురోగతి కనిపించడం లేదని వారు ఆరోపించారు. ఘటనతో సంబంధం ఉన్న వారిని, ఫామ్‌హౌస్ యజమాని వ్యాస్‌ను, అడ్వకేట్ కృష్ణ కుమార్‌ను విచారించాలని కమిషన్‌కు విన్నవించారు. పోలీసులు స్పందించక పోవడంతోనే కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుని సాయికుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కమిషన్‌ను కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బ్యాతల శివశంకర్ మాదిగ, శేరిలింగంపల్లి కన్వీనర్లు సింగ దాసరి నరేష్ మాదిగ, ప్రేమ్ కుమార్ మాదిగ, సీనియర్ నాయకులు ఐత రమేష్, నరేందర్ మాదిగ, రాజేష్ మాదిగ, కుటుంబ సభ్యులు నాగేష్, అనిల్, జీతయ్య తదితరులు ఉన్నారు.

# భారత్ బిల్డ్‌కాన్ 2026 రెండవ రోజు బలమైన వ్యాపార జోరు

**ప్రపంచ కొనుగోలుదారులు, పరిశ్రమ నాయకులు విధాన రూపకర్తలు విలువైన చర్చలు**

**శేరిలింగంపల్లి,జూన్ 19 (ప్రజాజ్యోతి):** భవన నిర్మాణ సామగ్రి, నిర్మాణ పరిశ్రమ కోసం భారతదేశపు ప్రముఖ ప్రదర్శన అయిన భారత్ బిల్డ్‌కాన్ 2026 -- వన్ నేషన్, వన్ ఎక్స్‌పో, న్యూఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో తన రెండవ రోజున కూడా అసాధారణమైన పరిశ్రమ భాగస్వామ్యాన్ని కొనసాగించింది. ఈ ఎక్స్‌పో దేశీయ అంతర్జాతీయ కొనుగోలుదారులు, ఆర్కిటెక్టులు,డెవలపర్లు,కాంట్రాక్టర్లు, తయారీదారులు, వ్యాపారులు, విధాన రూపకర్తలు, కన్సల్టెంట్లు,పరిశ్రమ సంఘాల నుండి భారీ సంఖ్యలో సందర్శకులను ఆకర్షించింది, తద్వారా ఈ రంగానికి అతిపెద్ద వ్యాపార నెట్‌వర్కింగ్ వేదికలలో ఒకటిగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ... భారత్ బిల్డ్‌కాన్ డైరెక్టర్ విశాల్ ఆచార్య ఇలా అన్నారు, “భారత్ బిల్డ్‌కాన్ మొదటి రెండు రోజులలో కనిపించిన స్పందన, భారతదేశ తయారీ రంగంపై పెరుగుతున్న ప్రపంచ విశ్వాసాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ఇలాంటి పారిశ్రామిక వేదికల ఆర్థిక ప్రభావాన్ని హైలైట్ చేస్తూ,భారత్ బిల్డ్‌కాన్ డైరెక్టర్ జితేంద్ర కతిరియా ఇలా అన్నారు,ఇంతటి స్థాయి కార్యక్రమాలు ఎగ్జిబిషన్ హాళ్లకు మించి విలువను సృష్టిస్తాయి. అవి తయారీ,లాజిస్టిక్స్,హాస్పిటాలిటీ, రవాణా,సేవల రంగాలలో వ్యాపార కార్యకలాపాలను ఉత్తేజపరుస్తాయి. ఎగ్జిబిషన్ యొక్క రెండవ రోజున విస్తృతమైన వ్యాపార సంభాషణలు, కొనుగోలుదారు-విక్రేత సమావేశాలు, ఉత్పత్తి ప్రదర్శనలు, విజ్ఞానాన్ని పంచుకునే సెషన్‌లు జరిగాయి. ఇవి భారతీయ తయారీదారులకు తమ మార్కెట్ పరిధిని విస్తరించుకోవడానికి, ప్రపంచ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి గణనీయమైన అవకాశాలను కల్పించాయి. భారతదేశ నిర్మాణ,భవన నిర్మాణ సామగ్రి రంగం దేశ ఆర్థిక వృద్ధికి బలమైన స్తంభాలలో ఒకటిగా ఆవిర్భవిస్తోంది. నిర్మాణ రంగం ప్రస్తుతం భారతదేశ జీడీపీకి దాదాపు 9% వాటాను అందిస్తూ,5.1 కోట్ల మందికి పైగా ఉపాధి కల్పిస్తోంది.




తద్వారా వ్యవసాయం తర్వాత దేశంలో రెండవ అతిపెద్ద ఉపాధి కల్పన రంగంగా నిలుస్తోంది. పరిశ్రమ అంచనాల ప్రకారం, 2025లో సుమారు 685 బిలియన్ డాలర్ల విలువైన భారతదేశ నిర్మాణ రంగ మార్కెట్, వేగవంతమైన పట్టణీకరణ,మౌలిక సదుపాయాల పెట్టుబడులు,గృహాల డిమాండ్,పారిశ్రామిక విస్తరణ మరియు ప్రభుత్వ నేతృత్వంలోని అభివృద్ధి కార్యక్రమాల కారణంగా 2034 నాటికి 1.24 ట్రిలియన్ డాలర్లను అధిగమిస్తుందని అంచనా. అదే సమయంలో, సిరామిక్స్, టైల్స్, శానిటరీవేర్, బాత్‌వేర్, పెయింట్స్, నిర్మాణ రసాయనాలు, హార్డ్‌వేర్, ప్లైవుడ్,లామినేట్‌లతో సహా భారతదేశ భవన నిర్మాణ సామగ్రి పరిశ్రమ,భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు,స్మార్ట్ సిటీ అభివృద్ధి, లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్లు,నివాస, వాణిజ్య రియల్ ఎస్టేట్ రంగాల నుండి పెరుగుతున్న డిమాండ్ మద్దతుతో బలమైన వృద్ధిని సాధిస్తోంది. భారతదేశం ఇప్పటికే ప్రపంచంలోనే సిరామిక్ టైల్స్ యొక్క అతిపెద్ద ఉత్పత్తిదారులలో ఒకటిగా ఉంది,బహుళ భవన నిర్మాణ సామగ్రి విభాగాలలో తన ప్రపంచ ఎగుమతి పరిధిని స్థిరంగా విస్తరిస్తోంది. జల్ శక్తి మంత్రిత్వ శాఖ, తాగునీరు,పారిశుధ్య విభాగం కార్యదర్శి శ్రీ అశోక్ కుమార్ మీనా పాల్గొనడం ఆ రోజు కార్యక్రమాలలో ఒక ముఖ్యమైన విశేషం. ఆయన తాగునీటి మౌలిక సదుపాయాల భవిష్యత్తు, పారిశుధ్య పరిష్కారాలు,సుస్థిర అభివృద్ధిపై పరిశ్రమ భాగస్వాములను ఉద్దేశించి ప్రసంగించారు. భారతదేశం యొక్క దీర్ఘకాలిక నీటి భద్రత మరియు ప్రజారోగ్య లక్ష్యాలకు మద్దతు ఇవ్వడంలో ఆవిష్కరణ, సాంకేతికత,నాణ్యమైన మౌలిక సదుపాయాల కీలక పాత్రను ఆయన తెలిపారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించాలి





**వ్యాపారంలా కాకుండా పేద విద్యార్థులకు విద్యను అందించాలి --రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**శంషాబాద్ మండలం నానాజీపూర్ లో పల్లవి ఇంటర్నేషనల్ స్కూలును ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

రాజేంద్రనగర్, జూన్ 19 (ప్రజా జ్యోతి) ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నానాజీపూర్ లో నూతనంగా నిర్మించిన పల్లవి ఇంటర్నేషనల్ ప్రైవేట్ స్కూల్లో శుక్రవారం రాచంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శంషాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని ఇక్కడ ఎన్నో ప్రైవేట్ విద్యాసంస్థలు స్కూల్లో నెలకొల్పే అన్నారు. ప్రైవేట్ స్కూల్లో వ్యాపారంలో కాకుండా పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించే విధంగా కృషి చేయాలన్నారు. పిల్లలకు ఆడుకోవడానికి క్రీడ స్థలం తోపాటు ఎంతో వెలివేషన్ ఏర్పాటు చేసి భవనాన్ని నిర్మించడం చాలా సంతోషం అన్నారు. శంషాబాద్ మండలంలో గ్రామీణ ప్రాంతం ఎక్కువ ఉందని గ్రామాలలో ఎంతోమంది ప్రైవేట్ స్కూళ్లకు పంపించే స్తోమత లేని తల్లిదండ్రులు ఉన్నారన్నారు. వారి కొరకు పాఠశాల యాజమాన్యం చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు అన్నపూర్ణ నారాయణ మూర్తి, కోడూరు,అనూరాధ, కిషోర్ కుమార్,సంధనా ఈశ్వర్,మానస కోడూరు,ప్రిన్సిపల్ రామకృష్ణప్ప, సర్పంచులు సురేఖ రాజు, గడ్డం శేఖర్ యాదవ్, ఎలుగని ప్రభాకర్ గౌడ్,పిఎసిఎస్ చైర్మన్ దవనాకర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, శంషాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, నాయకులు గణేష్ గుప్త,దండు ఇస్తారి, కొత్త యాదగిరి రెడ్డి, రమేష్ యాదవ్, సింహారెడ్డి, మల్చలం లింగం, రవి,నీరటి మహేష్, మల్లికార్జున్, శ్రీకాంత్ గౌడ్,శ్రీనివాస్, శివాజీ, నీళ్ళ శ్రీధర్ గౌడ్, ఈరే కార్ ఈశ్వర్, జురికి రమేష్,మల్లేష్,నీరటీ శేఖర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీతో కూడిన ఆలోచనలకు మద్దతు

-మొదటిపేజీ తరువాయి

వినూత్న కార్యక్రమాల ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహించడమే కాకుండా,వాటికి అవసరమైన వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. మా నిబద్ధత కేవలం స్టార్టప్‌లు, పరిశ్రమలకే పరిమితం కాలేదన్నారు. ఏఐ-ఎనేబుల్డ్ తరగతి గదులు, ఏఐ లిటరసీ మిషన్ ద్వారా భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నైపుణ్యాలతో దాదాపు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఇరవై లక్షల మంది విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. విద్య, పాలన, ఆవిష్కరణలు అంతర్భాగంగా ఉండేలా రాష్ట్రాన్ని నిర్మిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా చైర్మన్ డాక్టర్ జీవీ రావు మాట్లాడుతూ సాంకేతికత, లైఫ్ సైన్సెస్, రిటైల్, రియల్ ఎస్టేట్, క్రీడలు, వినోదం వంటి పలు రంగాలలో ఏకకాలంలో రాణించగల సామర్థ్యం హైదరాబాద్‌కు ఉండటమే అసలైన బలమన్నారు. నగర భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న అందరిని ఒక తాటిపైకి తీసుకురావడానికి, భవిష్యత్తులో అర్థవంతమైన చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఈ ఫోరమ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సదస్సుకు ఐదు వందల మందికి పైగా వ్యాపార ప్రముఖులు, విధాన రూపకర్తలు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక కేంద్రాలలో ఒకటిగా హైదరాబాద్ ఉంది. సాంకేతికత, వ్యాపార సంస్థలు, ఆవిష్కరణలు, పెట్టుబడులు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలకు అంతర్జాతీయ గమ్యస్థానంగా అవతరించింది. ఈ ఫోరమ్ స్థిరమైన, సమగ్ర వృద్ధిని సాధించే లక్ష్యంతో పరస్పర సహకారం, వ్యూహాత్మక చర్చలు, ఆచరణాత్మక ఆలోచనలను పంచుకోవడానికి ఒక అద్భుతమైన వేదికగా నిలిచింది. ‘హైదరాబాద్: భారతదేశ ఆవిష్కరణల రాజధానిగా ఎదుగుదల’ అనే అంశంపై చర్చించారు. ఎకనామిక్ రీసెర్చ్, గ్లోబల్ అడ్వైజరీ, పాలసీ ఇంటెలిజెన్స్ అంశాల ఆధారంగా ఈ ఫోరమ్ నిర్వహించారు.



దీర్ఘకాలిక ఆర్థిక పరివర్తనకు అవసరమైన శక్తులుగా డేటా ఆధారిత అంతర్దృష్టులు,అంతర్జాతీయ నైపుణ్యం, స్పష్టమైన విధాన రూపకల్పన ఎంతైనా అవసరమని ఈ సదస్సు పేర్కొంది. రోజంతా జరిగిన వివిధ సెషన్లలో ఆర్థిక వృద్ధి ఊ మార్కెట్ దృక్పథం, భవిష్యత్ అవసరాలకు తగ్గ మౌలిక సదుపాయాలు, డిజిటల్,ఏఐ పరివర్తన, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్, ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడులు, మూలధనం వంటి అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, వ్యూహాత్మక పెట్టుబడులు, సహకార పర్యావరణ వ్యవస్థలు హైదరాబాద్ అభివృద్ధిని ఏ విధంగా వేగవంతం చేయగలవు అనే విషయాలను ప్రతినిధులు అన్వేషించారు. వీటితో పాటు లైఫ్ సైన్సెస్, రిటైల్, రియల్ ఎస్టేట్, వెల్త్ మేనేజ్‌మెంట్, విద్య, హాస్పిటాలిటీ, వినోదం, మహిళా నాయకత్వం, క్రీడా మౌలిక సదుపాయాల వంటి విభిన్న రంగాలపై కూడా ప్రత్యేక సెషన్లు జరిగాయి. ఇది నగరం బహుముఖ వృద్ధి పథాన్ని ప్రతిబింబించింది. నాలెడ్జ్ పార్టనర్ ‘బోవర్ స్కూల్ ఆఫ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్’ సహకారంతో ‘ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా’ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. హైదరాబాద్ నగరం భారతదేశంలోనే మొట్టమొదటి పూర్తి స్థాయి గ్లోబల్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌గా అవతరించగలదా అనే అంశంపై జరిగిన చర్చలో నగరం విస్తృత ఆశయాలను వివరించారు. ఈ సదస్సులో మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ ప్రీతి రెడ్డి, లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) సతీష్ దువా, లైఫ్ సైన్సెస్ ఊ ఫార్మా సీఈఓ సర్వేష్ సింగ్, నెక్స్ట్‌వేవ్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ రాహుల్ అత్తులూరి, లామ్‌కాన్ ఫైనాన్స్ ఊ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ లాంబా, 360డీ స్పోర్ట్స్ ఫౌండింగ్ పార్ట్నర్ కార్తీక్ యనమండ్ర, ఏషియన్ సినిమాస్ వ్యవస్థాపకుడు సునీల్ నారంగ్, ఆక్సిమోరాన్స్ ఊ హాఫ్-ఎ-బావా హాస్పిటాలిటీ కన్సల్టెంట్స్ వ్యవస్థాపకుడు రెహాన్ గుహా, మృణాళిని రావు లగ్జరీ ఫ్యాషన్ లేబుల్ వ్యవస్థాపకురాలు ఊ క్రియేటివ్ డైరెక్టర్ మృణాళిని రావు తదితరులు పాల్గొన్నారు. ‘బీట్రూట్ న్యూస్’ వ్యవస్థాపకురాలు ఫే డిసౌజా కొన్ని సెషన్లకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది.....

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య.**



**శంకర్ పల్లి :జూన్ 19( ప్రజా జ్యోతి):** గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రభుత్వం నిధులను మంజూరు చేయడం జరుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. శుక్రవారం పొద్దుటూరు-మేడిపల్లి' పొద్దుటూరు-టంగుటూరు గ్రామాల లింక్ రోడ్డుకు రూపాయలు 5.50 కోట్ల నిధులతో రోడ్డుపైన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రోడ్డు రవాణా సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతుందని అన్నారు. గ్రామాల్లో మంచినీటి సౌకర్యం, అండర్ డ్రైనేజ్, సీసీ రోడ్లు, వీధిదీపాల సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంతో ఎన్నో ఏళ్లుగా ప్రజా సమస్యలను పరిష్కారం చేకూరడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందే విధంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని వివరించారు. ఇప్పటికే ఎంతోమంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించి వారి సొంత ఇంటి కలను సహకారం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, గ్రామ సర్పంచ్ బండ లక్ష్మి నరసింహ, మాజీ ఎంపీటీసీ బొల్లారం వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సర్పంచులు, సురేందర్ శ్రీనివాస్ రవీందర్ రెడ్డి మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు మాజీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బొల్లారం మోహన్ రెడ్డి, ఏపీవో నాగభూషణం, ఎంపీఓ గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

# 30 ఏళ్ల పురాతనమైన నాళాలను నూతన స్టీల్,కాంక్రీట్ స్టార్మ్ వాటర్ డ్రైన్ గా నిర్మాణం

**పనులను పర్యవేక్షించిన రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్**





**ఉప్పల్, జూన్ 19,( ప్రజా జ్యోతి )** బీరప్ప గడ్డ డివిజన్లోని బీరప్ప గడ్డ లో నూతనంగా నిర్మిస్తున్న కాంక్రీట్ బాక్స్ డ్రైన్ పనులను బస్తీ వాసులతో కలిసి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పర్యవేక్షించారు,అనంతరం వారు మాట్లాడుతూ బీరప్పగడ్డ లో ఓపెన్ నాళాలు నిర్మించి సుమారు 30 - 40 సంవత్సరాలు పూర్తయింది, పురాతనమైన ఓపెన్ నాళాలు శిథిలా అవస్థకు చేరాయని దానివల్ల ఎలుకలు పందికొక్కు లతో తీవ్ర ఇబ్బంది కలుగు తుందని బస్తీ వాసులు తెలిపారని, నూతన కాంక్రీట్ బాక్స్ డ్రైన్ లను నూతన టెక్నాలజీతో ఇరువైపులా స్టీల్ కాంక్రీట్ గోడలతో నిర్మిస్తున్నామని ప్రజలకు ఫ్యూచర్ లో కూడా పందికొక్కులతో ఎలుకల తో ఎటువంటి ఇబ్బంది కలగకుండా శాశ్వత పరిష్కార దిశగా పకడ్బందీగా ఒక ప్రణాళిక బద్ధంగా పనులు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో కాలేరు నర్సింగరావు, కావాలి శ్రీనివాస్ యాదవ్, తిరుపతి యాదవ్, వెంకట్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, బంటి గౌడ్, ఎల్లగొని ప్రకాష్ గౌడ్, ఎలేందర్, శంకరయ్య, మొదలగు వారు పాల్గొన్నారు.

# అక్రమ స్ర్కాబ్ షాపు శబ్ద కాలుష్యాం

**సమస్య పరిష్కారానికి కృషి : ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్, జూన్ 19,(ప్రజాజ్యోతి):** నాచారం డివిజన్ బాబానగర్ కాలనీలో అక్రమంగా నడిపిస్తున్న స్ర్కాప్ షాపు వల్ల ఇక్కడి ప్రజలు తీవ్ర శబ్ద కాలుష్యము వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి తో బస్తీ వాసులు పిర్యాదు చేశారు. శుక్రవారం బాబానగర్ వాసులను ఎం ఎం సి కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి వద్దకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో కలిసి వెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరడం జరిగింది. కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బాబా నగర్ బస్తివాసులు మనోజ్ బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

**భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎండి ఫైమీద**




**అబ్దుల్లాపూర్ మెట్టు జూన్ 19 (ప్రజాజ్యోతి)** సమాజంలో రోజు రోజుకు మహిళల మీద పెరుగుతున్న దాడులని అరికట్టడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని భారత జాతీయ మహిళా సమాఖ్య( ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ ) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎండి ఫైమీద అన్నారు.శుక్రవారం నాడు అబ్దుల్లాపూర్ మెట్టు మండలం రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్ 2 లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో మహిళా సమాఖ్య మెట్టు మండల కార్యదర్శి నవనీత అధ్యక్షతన జరిగిన భారత జాతీయ మహిళా సమాఖ్య మండల నిర్మాణ మహాసభకి ఫైమీద ముఖ్య అతిధిగా హాజరై ప్రశాంగించారు.టెక్నాలజీ పెరుగుతున్న కాలంలో కూడా మహిళలపైన దాడులు పెరుగుతున్నాయని ఏ మాత్రం తగ్గట్లేవని,గంజాయి,డ్రగ్స్,మద్యం లాంటి మత్తు పదార్థాలు విచ్చల విడిగా అందుబాటులో ఉన్నంత కాలం మద్యపానం పూర్తిగా నిషేదించనంత వరకు మహిళల పైన దాడులు ఆగవని అన్నారు.సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ మాట్లాడుతూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లుని సాకుగా చూపి 33 శాతం చట్టసభల్లో మహిళలకి రిజెర్వేషన్లు కల్పిస్తామని బైటికి చెప్పి నియోజకవర్గాల పునర్విభజన బిల్లుని పార్లమెంట్లో ఆమోదం పొందితే దక్షిణభారత దేశానికి తీరని అన్యాయం చేసే బీజేపీ కుట్రలని మహిళలతో పాటు సమాజం అంత తిప్పి కొట్టాలని 2023 లోనే పార్లమెంట్లో ఆమోదం పొందిన మహిళా రిజెర్వేషన్ బిల్లుకి కేంద్రం వెంటనే గెజిట్ విడుదల చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.అలాగే మార్కెట్లో కృడాయిల్ ధరలు తగ్గినందున పెట్రోల్,డిజిల్ మరియు వంట గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించి మహిళలకి భారం లేకుండా చేయాలనీ అన్నారు.మహిళల మీద జరిగిన అత్యాచార,హత్యల,దాడుల సంఘటనల్లో నమోదు అయినా కేసులని పెండింగ్లో పెట్టకుండా ఫాస్ట్రాక్ కోర్టుల ద్వారా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు.సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ మాఫియా మహిళలని మార్కెట్ వస్తువుగా మార్చుకొని కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని మండిపడ్డారు.సోషల్ మీడియా లో సైతం మహిళలని అసభ్యకరంగా ట్రోల్ చేస్తున్నారని అలాంటి వారిపై పోలీసులు ప్రత్యేక ద్రుష్టి పెట్టి వారికీ చట్టపరమైన శిక్షలు వేయాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కాటి అరుణ,సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్,అబ్దుల్లాపూర్ మెట్టు మండల సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా,మహిళా సమాఖ్య నాయకురాళ్లు సుజాత,దేవమ్మ,చందన,కవిత మరియు పాల్గొన్నారు.

# 87 కోట్ల విలువైన సీఆర్ఎఫ్ రోడ్ల అభివృద్ధి





-మొదటిపేజీ తరువాయి

కొనసాగుతున్నాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడితే గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఈ ప్రాంతం పట్టణీకరణ దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

**తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు...**

దేశవ్యాప్తంగా ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుల్లో భాగంగా తెలంగాణకు మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రతిపాదించబడినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. హైదరాబాద్--పూణే, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--చెన్నై మార్గాల్లో బుల్లెట్ ట్రైన్ల ఏర్పాటుకు ప్రాథమిక అంచనా వ్యయం సుమారు రూ.5 లక్షల కోట్లు కాగా, భూసేకరణ వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇది రూ.10 లక్షల కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్లకు సంబంధించిన సర్వే పనులు కొనసాగుతున్నాయని, సర్వే మరియు డీపీఆర్ (ఞూ=) పూర్తైన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఈ మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారనున్నాయని అభిప్రాయపడ్డారు. అలాగే హైదరాబాద్ చుట్టుపక్కల మరో రింగ్ రోడ్డు ఏర్పాటు చేసే దిశగా కూడా ఆలోచనలు జరుగుతున్నాయని, ఉత్తర హైదరాబాద్ ప్రాంతంలో భూసేకరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.20 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని రంగారెడ్డి జిల్లా గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, ఈ ప్రాంత అభివృద్ధికి రహదారి అనుసంధానం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషితో ఈ ప్రాంతానికి కేంద్ర నిధుల ద్వారా రూ.100 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరైనట్లు తెలిపారు. గతంలో కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడం వల్ల కొన్ని రహదారి పనులు ఆలస్యమైన విషయం వాస్తవమేనని అంగీకరించిన మంత్రి, ఇకపై అలాంటి పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొంగర, రావిరాల, తిమ్మాపూర్, లాచునూరు, అవరమియగూడెం తదితర ప్రాంతాలకు సంబంధించిన అన్ని రహదారి నిర్మాణ పనులను తక్షణమే సమీక్షించి, రాబోయే కొద్ది నెలల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రంగారెడ్డి జిల్లా, ముఖ్యంగా కందుకూరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా మెగా ఇంటీరియర్ డిజైన్ షో ప్రారంభం

-మొదటిపేజీ తరువాయి



ఈ సందర్భంగా కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ ఒక ఆర్కిటెక్ట్‌గా, ఒక ఎమ్మెల్యేగా నిర్మాణ రంగ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న తోటి నిపుణుల మధ్య ఉండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రదర్శన సరికొత్త ఉత్పత్తులు, సాంకేతికతలు, డిజైన్ ఆవిష్కరణలను ఒకే చోటకు చేర్చి, ఈ పరిశ్రమ ఎటువైపు పయనిస్తోందో తెలియజేసే ఒక సమగ్రమైన విజన్‌ను అందిస్తుందన్నారు. ఈ షోకేస్ నాణ్యత స్థాయి అంతర్జాతీయ ప్రమాణాలను ప్రతిబింబిస్తూ మన డిజైన్, నిర్మాణ రంగ వ్యవస్థకు ఉన్న అపారమైన సామర్థ్యాన్ని చాటి చెప్తుందన్నారు. మన నిపుణులు, వ్యాపారులు అంతర్జాతీయ పురోగతితో, సరికొత్త పోకడలతో నిరంతరం అనుసంధానమై ఉండేలా చూస్తూ,ఈ పరిశ్రమకు అన్ని విధాలా మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆవిష్కరణలకు, అద్భుతమైన డిజైన్‌కు, పట్టణాభివృద్ధికి ఒక బెంచ్‌మార్క్‌గా నిలపగలమని చెప్పారు.ఈ సందర్భంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ ప్రెసిడెంట్ ఆర్కిటెక్ట్ జిగ్నేష్ మోడీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పదకొండు వేల మందికి పైగా ఆర్కిటెక్ట్‌లు,ఇంటీరియర్ డిజైనర్లు, పరిశ్రమ నిపుణులను ఒకే చోటకు చేర్చే దేశంలో అగ్రగామి డిజైన్ సంస్థలలో ఐఐఐడీ ఒకటన్నారు. అత్యుత్తమ ప్రమాణాలను నెలకొల్పుతూ ఐఐఐడీ అతిపెద్ద, అత్యంత డైనమిక్ చాప్టర్లలో ఒకటిగా హైదరాబాద్ ఉందన్నారు.ఈ ప్రదర్శన కేవలం ఉత్పత్తులు, ఆవిష్కరణలను చూపించేది మాత్రమే కాదని,ఇది ప్రజల్లో అవగాహనను పెంచే, సృజనాత్మకతను ప్రేరేపించే,డిజైన్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న సరికొత్త అంతర్జాతీయ పోకడలను పౌరులకు పరిచయం చేసే ఒక గొప్ప వేదిక అన్నారు. రాబోయే మూడు రోజులు ఈ ఎక్స్‌పోను సందర్శించి, డిజైన్ రంగ భవిష్యత్తును స్వయంగా అనుభవించాల్సిందిగా కోరారు. డిజైనర్లుగా మన బాధ్యత అందమైన ఇంటీరియర్స్, సౌకర్యవంతమైన ప్రదేశాలను సృష్టించడానికే పరిమితం కాలేదన్నారు. మనం అనుభూతులను డిజైన్ చేస్తామని చెప్పారు. మానవ ప్రవర్తనను ప్రభావితం చేస్తూ, వారి శ్రేయస్సును పెంపొందిస్తూ ప్రజలు నివసించే, పని చేసే, అభివృద్ధి చెందే వాతావరణాన్ని మనం తీర్చిదిద్దుతామన్నారు. డిజైనర్లు జీవన ప్రమాణాలను పెంచే నిశ్శబ్ద శిల్పులు అన్నారు. ప్రతి పౌరుడిపై, సమాజంపై మన పనితీరు చెరగని ముద్ర వేస్తుందన్నారు.ఈ సందర్భంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ హైదరాబాద్ రీజినల్ చాప్టర్ ఛైర్‌పర్సన్ ఆర్కిటెక్ట్ ఎన్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈ రోజు మనందరికి ఎంతో గర్వకారణమైన రోజన్నారు. మనం ఇన్‌సైడర్ ఎక్స్ 6వ ఎడిషన్‌ను ప్రారంభించడమే కాకుండా,ఇండియన్ డిజైన్ రంగం సాధించిన అద్భుతమైన ప్రగతిని కూడా ఇక్కడ జరుపుకుంటున్నామని తెలిపారు. ఒక దశాబ్దం క్రితం, మనలో చాలా మంది స్ఫూర్తి కోసం విదేశాల వైపు చూసే వాళ్ళమన్నారు. కానీ ఈ రోజు ప్రపంచమే సృజనాత్మక నాయకత్వం కోసం భారతదేశం వైపు ఎంతో ఆసక్తిగా చూస్తుందన్నారు. ఆ మార్పును మనం తప్పకుండా సెలబ్రేట్ చేసుకోవాలన్నారు. ఇన్‌సైడర్ ఎక్స్ అనేది ఆ విజయానికి ఒక ప్రతిబింబం అన్నారు. మేము నమ్మేది ఏమిటంటే, డిజైన్ అనేది కేవలం బాహ్య సౌందర్యానికి మాత్రమే పరిమితం కాదన్నారు. మనం ఎలా జీవిస్తున్నాం? ఎలా పని చేస్తున్నాం?, ఎలా నేర్చుకుంటున్నాం?, మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఎలా అనుభూతి చెందుతున్నాం? అనే విషయాలను అది నిర్దేశిస్తుందన్నారు. డిజైన్ అనేది జీవితాన్ని సరికొత్తగా తీర్చిదిద్దుతుందన్నారు. భారతీయ డిజైనర్లు ప్రపంచంలోని అత్యుత్తమ నిపుణులతో భుజం భుజం కలిపి నిలబడుతున్నారన్నారు. విలక్షణమైన భారతీయతను కాపాడుకుంటూనే, ప్రపంచ స్థాయికి సరితూగే ప్రదేశాలను, అద్భుతమైన అనుభూతులను సృష్టిస్తున్నారని తెలిపారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

. హస్మత్‌పేట్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు..

. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి





**బోయిన్ పల్లి, జూన్ 19.(ప్రజా జ్యోతి):** లోక్‌సభ ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు హస్మత్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. హస్మత్‌పేట్ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద డివిజన్ అధ్యక్షుడు కావేటి మల్లికార్జున్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాహుల్ గాంధీ చిత్రపటం వద్ద కేక్ కట్ చేసి కార్యకర్తలతో కలిసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.ఈ సందర్భంగా దండుగుల యాదగిరి మాట్లాడుతూ, బీజేపీ కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతూ ఎస్ఐఆర్‌ను అడ్డంపెట్టుకొని రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ ముస్లిం మైనారిటీల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా దేశ ప్రయోజనాల కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేసే గొప్ప నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. అలాంటి గొప్ప కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడటమే తమ లక్ష్యమని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కనకరాజ్ యాదవ్, షాహెన్, షబ్బీర్, గౌస్, షజీద్, మల్లేష్, దేవేందర్, దండుగుల సందీప్, వెంకటేశ్, ఇంతియాజ్, అస్లాం, నవాజ్, శ్రీనివాస్, సాదత్, అక్రమ్, దశరథ్, సాంబయ్య, బాబా, సత్తి తదితరులు పాల్గొన్నారు.

# రామంతపూర్ పెద్ద చెరువు సమీపంలో ఉన్న గుడిసెలను సందర్శించిన బిజెపి నాయకులు, ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్



**ఉప్పల్, జూన్ 19,( ప్రజాజ్యోతి):** రామంతపూర్ చెరువు సుందరీకరణ పనులు మొదలైన నేపథ్యంలో బిజెపి నాయకులు ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ చెరువు సమీపంలో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించాలని గతంలో తాను హైడ్రా (న్ణ=ూూ) కమిషనర్ రంగనాథ్ ను కలిసి ఒప్పించి మెప్పించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సాంక్షన్ చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇళ్లను సాంక్షన్ చేసిన విషయాన్ని వారందరికీ వివరించారు,కాబట్టి మీ అందరికీ త్వరలోనే ఇళ్లు వస్తాయని ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అధికారికం గా డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించి, హ్యాండోవర్ చేసిన తర్వాతే ఇక్కడి గుడిసెలను ఖాళీ చేయాలని ఆయన స్థానికులకు స్పష్టం చేశారు. బాధితులకు ఏ కష్టం వచ్చినా, నష్టం వచ్చినా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఈ ?కార్యక్రమంలో హబ్సిగూడ మాజీ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్, సీనియర్ నాయకులు సంజయ్ పటేల్, వేములకొండ సోమశేఖర్ గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు చెల్లోజు ఎల్లాచారి, చింతకింది ప్రవీణ్, బొమ్మగోని రఘుపతి గౌడ్, జిల్లేల రవీందర్ రెడ్డి, కట్ట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

ఎస్ బి పల్లి ఉపసర్పంచ్ సున్నాల గణేష్

ఎస్ బి పల్లి హెల్త్ క్యాంపును ప్రారంభించిన ఉప సర్పంచ్ సున్నాల గణేష్



**కొత్తూర్ జూన్ 19 (ప్రజా జ్యోతి)** ఈ వానాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అదే విధంగా, పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని ఎస్ బి పల్లి ఉపసర్పంచ్ సున్నాల గణేష్ అన్నారు.శుక్రవారం కొత్తూరు మండలంలోని ఎస్ బి పల్లి హెల్త్ క్యాంపును ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఉప సర్పంచ్ సున్నాల గణేష్ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ సీజన్ లో మలేరియా,టైఫాయిడ్, డయేరియా,డెంగీ,ఫైలేరియా, చికెన్ గున్యా,సైనస్, మెదడువాపు వ్యాధి లాంటివి విజృంభించే అవకాశం ఉందని ఆయన అన్నారు.వానా కాలంలో ఇళ్ల చుట్టుపక్కల నీళ్లు నిలిచి దోమలు పుడతాయని వాటి ద్వారా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని,ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని ఉప సర్పంచ్ సున్నాల గణేష్ కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దండు తిరుపతయ్య,జంగయ్య, నందు, గ్రామస్తులు జే కృష్ణయ్య, ఎం లక్ష్మయ్య,జి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు
# విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ






**షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ సేవా కార్యక్రమం**

**కూకట్ పల్లి, జూన్ 19 (ప్రజా జ్యోతి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, నోట్‌బుక్స్, పుస్తకాలు, ఎడ్యుకేషన్ కిట్లు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గోల్ల జాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందజేస్తూ, వారి భవిష్యత్తు నిర్మాణంలో తోడ్పడటమే తమ లక్ష్యమని గోల్ల జాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థుల అభ్యున్నతే మా ప్రధాన లక్ష్యం. వారి విద్యా ప్రయాణంలో తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది. ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఏవైనా సరే ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాం. విద్యకు సంబంధించిన అవసరాల విషయంలో మా సహకారం నిరంతరం కొనసాగుతుంది" అని అన్నారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జాతీయ సమన్వయకర్త మన్నె జీవన్, మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా నాయకులు ఎం. సాయి కిరణ్, అనూప్ యూనియల్, సాద్విక్ తదితరులు పాల్గొని విద్యార్థులకు విద్యా కిట్లను అందజేశారు. విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, విద్యా రంగంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గోల్ల జాన్‌ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతను కూడా పెంచుతాయని వారు పేర్కొన్నారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా సేవా కార్యక్రమంగా నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ ముందుకు రావడం విశేషంగా నిలిచింది. విద్యార్థుల భవిష్యత్తు కోసం చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- వర్షాకాలంలో నిర్లక్ష్యం వద్దు
- చేవెళ్ల ఏసిపి కిషన్



**చేవెళ్ల జూన్ 19(ప్రజా జ్యోతి):** వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల ఏసీపీ కిషన్ సూచించారు. శుక్రవారం ఆయన పర్యవేక్షణలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, సీఐ భూపాల్ శ్రీధర్, 8వ వార్డు కౌన్సిలర్ ధవల్గారి గోపాల్ రెడ్డి తదితరులు కల్వర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. భారీ వర్షాల సమయంలో చెరువులు, వాగులు, కాలువలు, కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్నారు. వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలను దాటేందుకు ప్రజలు ప్రయత్నించవద్దని సూచించారు. నీటి లోతు, వేగం తెలియకుండా వాహనాలతో గానీ, నడిచి గానీ వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. చిన్నారులను వరద ప్రాంతాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప భారీ వర్షాల సమయంలో బయటకు రావద్దని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన తీగలు, నీటిలో మునిగిన విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలని సూచించారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. ప్రజలు స్థానిక అధికారులు, పోలీస్ శాఖ, విపత్తు నిర్వహణ శాఖ సూచనలు పాటించాలని, ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తయ్య, మాజీ ఉపసర్పంచులు టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, బి. విజయ్ కుమార్, మాజీ డైరెక్టర్ యాదయ్య, నాయకులు ఎర్ర గోపాల్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల బలోపేతమే అమ్మ మాట అంగన్వాడి బాట

**ఐసిడిఎస్ సూపర్వైజర్ తులసి**



**యాచారం, జూన్ 19 (ప్రజాజ్యోతి):** అంగన్వాడీలను ఇంకా బలోపేతం చేయడానికి తద్వారా అంగన్వాడీల్లో మెరుగైన చిన్నారుల నమోదును పెంచేందుకు అమ్మ మాట అంగన్వాడి బాట ప్రధాన ఉద్దేశమని ఐసిడిఎస్ సూపర్వైజర్ తులసి చెప్పారు. ఇబ్రహీంపట్నం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కొత్తపల్లిలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడంతోపాటు చిన్నారుల్లో మానసిక శారీరక అభివృద్ధి పెరుగుతుందన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. చిన్నారుల నాణ్యమైన విద్య కోసం మెరుగైన ఆరోగ్య సేవ కోసం అమ్మ మాట అంగన్వాడి బాట ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవ కౌంట్‌డౌన్‌కు భారీ ఏర్పాట్లు

**ఉదయం 5.30 గంటలకు జరిగే కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలి : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**





**బోయిన్ పల్లి, జూన్ 19. (ప్రజా జ్యోతి):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న 24 గంటల కౌంట్‌డౌన్ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన అనంతరం భారతదేశానికి చెందిన అత్యంత ప్రాచీన యోగా సంప్రదాయాన్ని ప్రపంచానికి పరిచయం చేశారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. భారత ప్రతిపాదనకు స్పందించిన ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ప్రస్తుతం సుమారు 200 దేశాల్లో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారని, విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు కూడా యోగా కార్యక్రమాలను చేపడుతున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో గత ఐదారు సంవత్సరాలుగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 24 గంటల కౌంట్‌డౌన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు పరిసర జిల్లాలకు చెందిన యోగా సంస్థలు, యోగా శిక్షకులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ సామాజిక సంస్థలు కూడా యోగా దినోత్సవాన్ని సామాజిక ఉద్యమంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. శనివారం ఉదయం జరిగే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్‌తో పాటు మాజీ ఉపరాష్ట్రపతి, ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులు హాజరుకానున్నారని వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున 5.30 గంటలకు ప్రారంభమయ్యే కౌంట్‌డౌన్ కార్యక్రమంలో హైదరాబాద్ నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాను విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

ప్రతీ వార్డు అభివృద్ధికి 5లక్షల నిధులు

మున్సిపల్ సమావేశంలో చైర్మన్ జాం. రవి



**శామీర్ పేట్, జూన్ 19,(ప్రజాజ్యోతి)** మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు కావాల్సిన మౌళిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి తెలిపారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో సాధరణ సమావేశాన్ని చైర్మన్ జాం రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో వీధి దీపాలు, స్వచ్ఛమైన తాగునీరు, డ్రైనేజిల పరిశుభ్రత లాంటి అంశాలపై అధికారులు దృష్టి సారించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. సాధరణ నిధుల నుంచి మున్సిపల్ లోని ప్రతి వార్డుకు రూ. 5 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. మొదటి విడతలో భాగంగా రూ. 2.50 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, వైస్ చైర్ పర్సన్, ఆర్ ఓ హర్షద్, కౌన్సిలర్లు, మేనేజర్ ఉష, టిపిఒ మహేష్ చంద్రకాంత్ , ఆర్ ఐ లు రాజేశ్వర్రెడ్డి, గౌతమి, డిఇఇ స్ఫూర్తి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ మోహన్ సింగ్, మల్లిఖార్జున్, ఎటిపిఒ దేవేందర్ రావు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు





**ఉప్పల్, జూన్ 19,(ప్రజా జ్యోతి):** శుక్రవారం పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ బస్ డిపో వద్ద రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్--మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై కేక్ కట్ చేసి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాహుల్ గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ శివ గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఏనుగు జలంధర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు కంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జి లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలి

- ఖానాపూర్ సర్పంచ్ దుగ్గపురం అనితా శ్రీనివాస్






**తలకొండపల్లి,జూన్19 (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో అమ్మా మాట–అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ దుగ్గపురం అనితా శ్రీనివాస్ అధ్వర్యంలో అంగన్‌వాడీ ఉపాద్యాయురాలు నిర్మల,అంగన్‌వాడీ చిన్నారులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ...ప్రైవేటు పాఠశాలలకు పోటీగా అంగన్వాడీ కేంద్రాలు నడుస్తున్నాయన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆట,పాట,ఆహ్లాదకరమైన వాతావరణం,భోజనం,గుడ్డు,పాలు, పిల్లలకు స్నాక్స్ ఇవ్వడం జరుగుతుందాని గ్రామంలో అమ్మమాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. రెడున్నరేళ్ల వయసు నుంచి ఐదేళ్ల లోపు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీలో ఆకర్షితులయ్యేలా చిన్నారుల కోసం అధునాతన పరికరాలతో కూడిన విద్య ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనితా శ్రీనివాస్,సెక్రటరీ రాఘవేందర్,ఉప సర్పంచ్ గోపాల్ నాయక్,అంగన్‌వాడీ ఉపాద్యాయులు టి.నిర్మల మరియు గ్రామ పెద్దలు,యువకులు తదితరులు ఉన్నారు.

# 12 ఏళ్ల విశ్వాసం, వికాసం, ప్రజా సంక్షేమం అంశంపై మహబూబ్ నగర్ లో పీఐబీ వార్తాలాప్ వర్క్ షాప్

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం: డీపీఆర్వో పీ.శ్రీనివాస్**

**కృత్రిమ మేధ యుగంలో వాస్తవ నిర్ధారణకు ప్రాధాన్యమివ్వాలని సూచన**





**మహబూబ్‌నగర్, జూన్,19:** ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో విలేకరులు క్రియాశీలక పాత్ర పోషించాలని మహబూబ్‌నగర్ జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డీపీఆర్వో) శ్రీ పీ శ్రీనివాస్ అన్నారు. "12 ఏళ్ల విశ్వాసం, వికాసం, ప్రజా సంక్షేమం' పేరిట దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచారంలో భాగంగా పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) హైదరాబాద్ విభాగం ఈ రోజు మహబూబ్‌నగర్‌లో ప్రత్యేక వార్తాలాప్ మీడియా వర్క్‌షాపును నిర్వహించింది. వర్క్‌షాపును డీపీఆర్వో శ్రీ పీ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కృత్రిమ మేధ, డిజిటల్ సమాచార యుగంలో వాస్తవ నిర్ధారణ, బాధ్యతాయుతమైన పాత్రికేయానికి ఉన్న ప్రాధాన్యం గురించి వివరిస్తూ, ప్రచురణకు ముందే సమాచారాన్ని సరిచూసుకోవాలనీ, నైతిక విలువలతో కూడిన రిపోర్టింగు ద్వారా సమాజంలో అవగాహన పెంపొందించడానికి తోడ్పడాలనీ విలేకరులను కోరారు. ఈ కార్యక్రమంలో పీఐబీ హైదరాబాద్ విభాగం మీడియా, కమ్యూనికేషన్ అధికారి శ్రీమతి వర్గంటి గాయత్రి మాట్లాడుతూ వార్తాలాప్ కార్యక్రమ విశిష్టత గురించి వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు అందించడంలోని ప్రాధాన్యాన్ని ఆమె తెలియజేశారు. విశ్వసనీయ, పారదర్శక సమాచారాన్ని అందించడం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలకూ, ప్రజలకూ మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో పీఐబీ కీలకపాత్ర పోషిస్తోందన్నారు.

గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలపై ఈ వర్క్‌షాపులో ప్రముఖ పాత్రికేయులు శ్రీ ముద్దం నరసింహస్వామి ప్రజెంటేషన్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, పాలన సంస్కరణలపై ఆయన పాత్రికేయులకు సమగ్ర అవగాహనను అందించారు.

డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్-చెకింగ్

డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్-చెకింగ్, తప్పుడు సమాచారాన్ని ఎదుర్కోవడంపై ఫ్యాక్ట్ చెక్ శిక్షకురాలు శ్రీమతి బీఎన్ సత్యప్రియ అవగాహన కల్పించారు. విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారాన్ని ధ్రువీకరించుకోవడం, అసత్య కథనాలను గుర్తించడం, బాధ్యతాయుతమైన వార్తా నివేదనకు ఉత్తమ పద్ధతులను స్వీకరించడానికున్న ప్రాధాన్యాన్ని ఆమె వివరించారు. ప్రభుత్వ విధానాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు వాస్తవ నిర్ధారణ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని, విశ్వసనీయతకు ప్రాధాన్యమివ్వాలని పాత్రికేయులకు సూచించారు. సుమారుగా 140 మంది జర్నలిస్టులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ వర్క్‌షాపులో ఎంతో ఉత్సాహంతో పాల్గొన్న జర్నలిస్టులు- జర్నలిజం, సమాచార ప్రసారం, డిజిటల్ మీడియా పద్ధతుల గురించి నిపుణులతో చర్చించారు. విలేకరుల సందేహాలకు నిపుణులు సమాధానాలిచ్చారు. వృత్తిపరమైన నైతిక విలువలనూ, వార్తలను అందించడంలో కచ్చితత్వాన్ని పాటిస్తూనే మారుతున్న పాత్రికేయ రంగానికి అనుగుణంగా సిద్ధం కావడంపై వారు పాత్రికేయులకు సూచనలు అందించారు. బాధ్యతాయుతమైన పాత్రికేయం, డిజిటల్ అక్షరాస్యత, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని సమర్థంగా ప్రజలకు చేరవేయడానికి ఉన్న ప్రాధాన్యం గురించి ఈ కార్యక్రమం తెలియజేసింది.

కార్యక్రమంలో పాల్గొన్న పాత్రికేయులను డీపీఆర్వో పీ శ్రీనివాస్ ప్రశంసిస్తూ... ప్రజలకు కచ్చితమైన, విశ్వసనీయమైన సమాచారాన్ని సకాలంలో అందించడంలో మీడియా పాత్రను బలోపేతం చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని వ్యాఖ్యానించారు.

# తలకొండపల్లిలో బీఎల్ఓలకు 'ఎస్ఐఆర్‌పై' శిక్షణ






**తలకొండపల్లి జూన్19 (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం తలకొండపల్లి తహసీల్దారు కే.రమేష్ కుమార్ అధ్యక్షతన బీఎల్ఓలకు 'ఎస్ఐఆర్‌పై' శిక్షణ సదస్సులు నిర్వహించడం జరిగింది.కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్)పై రైతు వేదికలో వివిధ పార్టీల నాయకులు,బీఎల్వోలు,బీఎల్ఏలు,శిక్షణ అధికారులు ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నట్లు తహసీల్దారు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి బూత్ లెవల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారని తెలిపారు.ఓటర్లు వాటిని పూర్తిగా నింపి బీఎల్ఓలకు నేరుగా లేదా బూత్ లెవల్ ఏజెంట్లకు సమర్పించవచ్చని పేర్కొన్నారు.పారదర్శకంగా,తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.బూత్ లెవల్ లో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న బిఎల్ఓలను వారు అభినందించారు.ప్రభుత్వం గుర్తించిన 12 రకాల గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హులైన వారి పేర్లను తుది ఓటర్ల జాబితాలో చేర్చుతామని తెలిపారు.ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారు,ద్వంద్వ ఓటు నమోదులు కలిగిన వారి పేర్లను తొలగిస్తామని పేర్కొన్నారు.18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్ల నమోదు,నివాసం మారిన వారి ఓటును కొత్త ప్రాంతానికి బదిలీ చేసే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నామని వివరించారు.ప్రతి వ్యక్తికి ఒకే చోట ఓటు కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారి వెంకట్ రమణ రెడ్డి,డిటి.రాజశేఖర్ రెడ్డి,ఆర్ఐలు శ్రావణ్ కుమార్,శ్రీకాంత్,సర్పంచ్‌లు కటికెల శేఖర్ యాదవ్,నాయకులు భక్కి కుమార్,అవంచ నరసింహా రెడ్డి,శ్రీనివాస చారి,రాములు,పేరుమల్ల జంగయ్య,పుట్ట పాండు,రాజేందర్ మరియు బిఎల్ఓలు,బిఎల్ఏలు తదితరులు ఉన్నారు.

# ఓటరు సేవలకు అందుబాటులో బీఎల్ఓలు

**- చేవెళ్లలో బూత్ అధికారుల వివరాలు విడుదల**



**చేవెళ్ల జూన్ 19(ప్రజా జ్యోతి):** ఓటరు జాబితా సేవలను మరింత సులభతరం చేసేందుకు ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టారు. 53-చేవెళ్ల (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ స్టేషన్ల వారీగా నియమించిన బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), బీఎల్ఓ సూపర్‌వైజర్ల వివరాలను విడుదల చేశారు. భారత ఎన్నికల సంఘం, తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు, రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సూచనల మేరకు ఈ వివరాలను ప్రజల సమాచారం కోసం అందుబాటులో ఉంచినట్లు ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన బీఎల్ఓ పేరు, మొబైల్ నంబర్‌తో పాటు సంబంధిత బీఎల్ఓ సూపర్‌వైజర్ పేరు, ఫోన్ నంబర్లను వెల్లడించారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, తొలగింపులు, చిరునామా మార్పులు వంటి సేవల కోసం ఓటర్లు తమ పరిధిలోని బీఎల్ఓ లేదా బీఎల్ఓ సూపర్‌వైజర్‌ను సంప్రదించవచ్చని సూచించారు. బీఎల్ఓల వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పోలింగ్ స్టేషన్ నోటీస్ బోర్డులు, ఇతర ప్రజా ప్రదేశాల్లో ప్రదర్శించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ఎన్నికల జాబితాకు సంబంధించిన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో కోరారు.

# వెల్జాల్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ నిర్మాణం




**తలకొండపల్లి,జూన్ 19 (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణంకై రూ.16కోట్లతో అత్యాధునికమైన పద్ధతిలో నిర్మాణం చేసి పేద మద్యతరగతి విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది.అట్టి పాఠశాల నిర్మాణంలో భాగంగా డెవలప్‌మెంట్ కోసం వెల్జాల్ గ్రామంలో నూతన కమిటీని శుక్రవారం ఎర్పాటు చేశారు.ఈ కమిటీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమిటీ చైర్మన్‌గా నసీమా సుల్తానా వ్యవహరిస్తూ 25మందితో కూడిన నూతన కమిటీ ఎర్పాటు చేయడం జరిగింది.ఈ కమిటీ డైరెక్టర్లుగా జి.శ్రీనివాసమూర్తి,సిఎల్ శ్రీనివాస్ యాదవ్,చెర్ల.వెంకట్ రెడ్డి,కే.యాదగిరి,పి.అశోక్ బాబు,ఎం.అంబాజీ,వారణాసి వెంకటేష్,సిహెచ్.రామ్ సిహెచ్.విష్ణువర్ధన్ యాదవ్,ఏ.వెంకటరెడ్డి,ఏ.అంజయ్య గౌడ్,ముజబుర్ రెహమాన్,పి.సుదర్శన్,ఎం.ఏ అజీజ్,పి.దశరథం,ఎస్.విజయకుమార్,ఎస్,శ్రీనివాస్ రెడ్డి,అయిల్ రవీందర్ గౌడ్,పులిజాల విష్ణు,టీ.ప్రకాష్ గౌడ్,ఏ.శ్రీశైలం గౌడ్,వద్దే.రాజు,ఎండి ఆరీఫ్,ఏ.శ్రీరాములు గౌడ్,జి.విజయ్ యాదవ్ లను డైరెక్టరుగా నియమితులయ్యారు.

# సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకొని విద్యార్థి అనుమానాస్పద మృతి



**అబ్దుల్లాపూర్ మెట్టు జూన్ 19(ప్రజా జ్యోతి)** హయత్ నగర్ కుంట్లూరు రోడ్డులోని శంకర్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 2 లో ఓ విద్యార్థి సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకుని ప్రాణాలు కోల్పోయిన సంఘటన చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం బ్రతుకుతెరువు కోసం స్వగ్రామం నుండి శుభోదయ కాలనీ రోడ్ నెంబర్ 1 లో చెరుకుపల్లి రేణుక నగేష్ దంపతులు కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వారికి ఇద్దరు సంతానం కొడుకు చెరుకుపల్లి మహేష్(18) హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నట్లుగా తెలుస్తుంది.ఈ క్రమంలో శుభోదయ కాలనీకి పక్కనే ఉన్న శంకర్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 2 లో చెరుకుపల్లి మహేష్ వాళ్ళ బంధువులు ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు.గత రెండు రోజుల క్రితం వారు ఇంటికి తాళం వేసుకొని శ్రీశైలం వెళ్లడం జరిగింది. వారు శ్రీశైలం నుండి తిరిగి హయత్ నగర్ కు చేరుకుంటున్న సమయంలో చెరుకుపల్లి మహేష్ ఫ్యాన్ కు ఉరివేసుకొని చనిపోయాడని సమాచారం అందింది. వెంటనే వారు అక్కడికి వచ్చి చూడగా సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకొని చనిపోవడం చూశారు. విషయం తెలుసుకున్న హయత్ నగర్ పోలీసులు మహేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించడం జరిగింది. మృతుడి ఆత్మహత్యకు ఏదైనా ప్రేమ వ్యవహారం దాగి ఉందా లేక ఇతర ఏమైనా కారణాలు దాగి ఉన్నాయా అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఒక్కగానొక్క కొడుకు ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రులతో పాటు తోబుట్టు రోదన వర్ణనాతీతంగా మారింది. విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి.

# నిరుపేద అనాథ ఆడపిల్లలకు అండగా ఉప్పల ఆశ్రమం

-మొదటిపేజీ తరువాయి





మంత్రివర్యులు లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్,శేషారెడ్డి,రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి,రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజిని సాయిచంద్,లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతి మాతకు పూజలు చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,మాజీ మంత్రివర్యులు మాట్లాడారు.కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా పేదలకు పలు సేవా కార్యక్రమాలను అందిస్తూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే నేతగా ఎదిగిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్,ను అభినందించారు.విద్య ద్వారానే పేదరిక అసమానతలు,పేదల తలరాతలను మార్చవచ్చు అనే లక్ష్యంతో ఉప్పల ఆశ్రమ పాఠశాలను రూ,10 కోట్లతో నిర్మించి ఉచితంగా విద్యను అందించడం గొప్ప విషయం అన్నారు.నేటి సమాజంలో ఎంత సంపాదించినా ఇంకొంత సంపాదించాలనే మనస్తత్వంతో కూడిన వ్యక్తులున్న సమాజంలో తాను వ్యాపారంలో సంపాదించిన సంపదను పేదల జీవితాలను మార్చేందుకు ఖర్చు చేయడం ప్రశంసనీయమన్నారు.నిరుపేద బాలికలు ఈ చక్కటి అవకాశాన్ని వినియోగించుకొని మంచిగా చదువుకొని జీవితంలో స్థిరపడాలని సూచించారు.భవిష్యత్తులో పేద ప్రజలకు ఇంకా మెరుగైన సేవలను ఉప్పల ట్రస్టు ద్వారా అందించాలని ఆకాంక్షించారు.ఏ స్వార్థం లేకుండా నిస్వార్థంగా ఈ ప్రాంతంలోని ప్రజలకు సేవలను అందిస్తున్న ఉప్పల వెంకటేష్ ను ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా,తలకొండపల్లి సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి,మాజీ ఎంపీపీలు సిఎల్ శ్రీనివాస్ యాదవ్,తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్,లక్ష్మీదేవి రఘురాములు,మాజీ జెడ్పిటిసిలు పద్మ నరసింహ,దశరథ్ నాయక్,కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మా సత్యం,సర్పంచుల సంఘం అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్,ఆమనగల్ మున్సిపల్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము,మాజీ సర్పంచులు లలిత జ్యోతయ్య, వెంకట్రామిరెడ్డి, చంద్రయ్య,ఈశ్వర్,వివిధ గ్రామాల సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,మాజీ ప్రజా ప్రతినిధులు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,ఉప్పల వెంకటేష్ మిత్రమండలి సభ్యులు,విద్యార్థులు,ప్రజలు,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేటితరం యువతకు ఆదర్శప్రాయం రాహుల్ గాంధీ

**- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**



**తలకొండపల్లి జూన్19 (ప్రజాజ్యోతి)** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి యొక్క హైదరాబాద్‌లోని వారి నివాసంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,అభిమానులు,కార్యకర్తలు,యువకుల అధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులకు,కార్యకర్తలకు తినిపించి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ... ప్రజాస్వామ్యం,సామాజిక న్యాయం,సమ్మిళిత అభివృద్ధి విలువల పట్ల రాహుల్ గాంధీకి ఉన్న అంకితభావం ప్రశంసనీయమని అన్నారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఎన్నో సవాళ్లు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతాల కోసం రాహుల్ గాంధీ ధైర్యంగా నిలబడుతున్నారని కొనియాడారు.దేశం కోసం అసాధారణ త్యాగాలు చేసిన కుటుంబ వారసత్వాన్ని వినయంతో,నిబద్ధతతో ముందుకు తీసుకెళ్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు.భారతదేశాన్ని ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించే ఆదర్శ నాయకుడిగా రాహుల్ గాంధీ ఎదిగారని ఎమ్మెల్యే అన్నారు.ఆయనకు మంచి ఆరోగ్యం,ఆనందం,అపార శక్తి కలగాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోల్యూషన్ బోర్డు సభ్యులు ఠాగూర్ బాలాజి సింగ్,పిసిసి సభ్యులు అయిల్ శ్రీనివాస్ గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహా,డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి,బిచ్య నాయక్,సురేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**ప్రధానమంత్రిని చేసేందుకు కంకణ బదులు కావాలి**

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటె శ్రీశైలం**



**యాచారం, జూన్ 19 (ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటె శ్రీశైలం ఆధ్వర్యంలో అట్టహాసంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందజేశారు. శ్రీశైలం మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాన్నమ్మ ఇందిరాగాంధి, తండ్రి రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం అన్నారు. పేద మధ్యతరగతి ప్రజల కోసం పట్టు వదలకుండా రాహుల్ గాంధీ.. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రతిఘటిస్తూ నిర్విరామంగా పోరాడుతున్నారని అన్నారు. ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త రాహుల్ గాంధీని ఆదర్శంగా తీసుకొని ప్రధాన మంత్రిని చేసేందుకు కంకణ బద్ధులై పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com

# ఖైతలాపూర్‌లో దుర్గామాత పుట్ట గుడి ధ్వంసం

నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి

ఘటనపై ఆందోళన వ్యక్తం చేసిన మాజీ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్



**కూకట్ పల్లి, జూన్ 19 (ప్రజా జ్యోతి) :** ఖైతలాపూర్ గ్రౌండ్స్‌లోని సర్వే నంబర్ 911లో గత నాలుగు తరాలుగా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న దుర్గామాత పుట్ట గుడిని గుర్తుతెలియని వ్యక్తుల చేత ధ్వంసానికి గురైనట్లు సమాచారం అందడంతో, మూసాపేట్ మాజీ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ఘటనాస్థలాన్ని సందర్శించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖైతలాపూర్ గ్రామ ప్రజలు ఈ దేవాలయాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తూ ఎన్నో సంవత్సరాలుగా పూజలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఏడాది బోనాల పండుగను ఈ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించడంతో పాటు, ఇతర దేవాలయాల్లో జరిగే కళ్యాణోత్సవాల కోసం కూడా ఇక్కడి దుర్గామాత పుట్ట గుడి మట్టిని తీసుకెళ్లే సంప్రదాయం కొనసాగుతోందని పేర్కొన్నారు. అలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన ఈ పుణ్యక్షేత్రాన్ని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నిన్న రాత్రి ధ్వంసం చేసినట్లు ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయని ఆయన అన్నారు. గుడి పరిసర ప్రాంతంలో వాహనం సంచరించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, కారుతో గుడి చుట్టూ పలుమార్లు తిరుగుతూ నిర్మాణాన్ని కూల్చివేసినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఘటనపై సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించగా, వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలనలు చేపట్టినట్లు మహేందర్ వెల్లడించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులైన వ్యక్తులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మతపరమైన భావోద్వేగాలను దెబ్బతీసే ఇటువంటి చర్యలను ప్రభుత్వం, పోలీసులు అత్యంత సీరియస్‌గా పరిగణించాలని కోరారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానిక హిందూ సమాజ ప్రతినిధులు, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఐలయ్య, పిల్లి మధుసూదన్, కృష్ణ యాదవ్, ధనరాజు, రాము, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బైండ్ల రవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# "మీ ఓటు--నీ హక్కు"పై అల్వాల్‌లో బీఆర్ఎస్ మహాసభ





**అల్వాల్, జూన్ 19 ( ప్రజా జ్యోతి )** మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అల్వాల్‌లో "మీ ఓటు -- నీ హక్కు" అనే అంశంపై బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయ్యాయని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం జోడెడ్ల మాదిరిగా ముందుకు సాగాయని అన్నారు. 2014కు ముందు తెలంగాణ పరిస్థితులు ఎలా ఉండేవో, రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఎలా మారాయో ప్రజలు గమనించాలని సూచించారు. తెలంగాణ ఏర్పడక ముందు ఎండాకాలంలో తీవ్ర విద్యుత్ కోతలు ఉండేవని, పరిశ్రమలకు పవర్ హాలిడేలు ప్రకటించే పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. అలాగే హైదరాబాద్‌లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉచితంగా 25 వేల లీటర్ల మంచినీటి సరఫరా పథకంతో పాటు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గతంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి పార్టీని వీడినంత మాత్రాన పార్టీ బలహీనపడలేదని, కార్యకర్తల్లో మరింత ఉత్తేజం పెరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులకు ప్రభుత్వం నడిపే సామర్థ్యం లేదని, అమలు చేయలేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ వాటి అమలులో విఫలమైందని కేటీఆర్ అన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ, ఓటు విలువపై ప్రతి కార్యకర్త ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన రోడ్ ఏర్పాటుకు నిధులు మంజూరు

**- చొరవచూపిన తలసానికి ప్రత్యేక ధన్యవాదాలు**

**- బాపు నగర్ అధ్యక్షులు హరి సింగ్ జాదవ్**



**అమీర్పేట్,జూన్19(ప్రజాజ్యోతి) :** ఎస్ఆర్ నగర్ కమ్యూనిటీ హాల్ నుండి ,బాపునగర్ కు వెళ్లే మార్గంలో నూతన రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు అయినట్లు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, బాపునగర్ అధ్యక్షులు హరిసింగ్ జాదవ్ తెలిపారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ ఈ రహదారి పూర్తిగా గతుకుల గుంతగా తయారయి ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇదే నేపథ్యంలో ఈ సమస్యను సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకొని వెళ్లగా ప్రజా సమస్యపై స్పందించిన అయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి నివేదిక ప్రకారం నూతన రోడ్ ఏర్పాటుకు అవసరమైన 86 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడంలో ప్రత్యేక చొరవ చూపారని అన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే తలసానికి హరి సింగ్ జాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే వీలైనంత త్వరలో నూతన రోడ్ పనులను ప్రారంభించేలా చూడాలని అధికారులను కోరారు.

# రోడ్డు సమస్యలు తలెత్తకుండా నివారణ చర్యలు చేపట్టాలి

**- తలకొండపల్లి సర్పంచుల సంఘం అధ్యక్షుడు కటికెల శేఖర్ యాదవ్**




**తలకొండపల్లి,జూన్19 (ప్రజాజ్యోతి)** తలకొండపల్లి మండల కేంద్రంలో రోడ్డు సమస్యలు తలెత్తకుండా నివారణ చర్యలు చేపట్టాలని తలకొండపల్లి సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కటికెల శేఖర్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆర్ అండ్ బి అధికారి ఏఈని పిలిపించి తలకొండపల్లి మండల కేంద్రంలో ఉన్న సమస్యలను సర్పంచ్ వారికి వివరించారు. రోడ్డు వెడల్పు చేసిన తర్వాత వాహనాలు వేగంగా వెళ్ళటం జరుగుతుందని,కావున పాఠశాలల దగ్గర మరియు జనాభా ఎక్కువ తిరిగే చోట ప్రమాదాలు జరగవచ్చని అధికారికి సూచించారు. అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు వేయాలని సర్పంచ్ కోరారు. రోడ్డుకు ఇరువైపులా ఓపెన్ అండర్ డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవటం వల్లన మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచి పోవటం జరుగుతుందని,డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డుకు మధ్యలో అక్కడక్కడ వర్షపు నీరు నిలుస్తుందని అ సమస్యలు కూడా వెంటనే పరిష్కరించాలని ఆర్అండ్‌బి అధికారిని సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ కోరారు.

# రాహుల్ గాంధీ జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్న కాంగ్రెస్ శ్రేణులు




**అల్వాల్, జూన్ 19 ప్రజా జ్యోతి** అల్వాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేబుల్ శేఖర్ ఆధ్వర్యంలో, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు, కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీకాంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ తరఫున రాహుల్ గాంధీ అందిస్తున్న నిస్వార్థ సేవలను కొనియాడారు. దేశ ప్రజల హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయం సాధనకు ఆయన చేస్తున్న కృషిని గుర్తు చేసుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో కృష్ణ గౌడ్, కేబుల్ శేఖర్, సి.ఎల్. యాదగిరి, భాస్కర్, నల్ల బలవంత్ రెడ్డి, మల్లెల శివ, అశోక్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేష్ గౌడ్, బాబిత, వీనస్ మేరీ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుతూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. స్థానిక ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.

# ప్లాస్టిక్ వాడితే ఫైన్ తప్పదు

- మున్సిపల్ కమిషనర్ యాదగిరి
- చేవెళ్లలో మున్సిపల్ అధికారుల తనిఖీలు
- 8 వ్యాపార సంస్థలకు రూ.36,500 జరిమానా





**చేవెళ్ల జూన్ 19(ప్రజా జ్యోతి):** నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై చేవెళ్ల మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. పట్టణంలోని పలు వ్యాపార సముదాయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపార సంస్థలపై జరిమానాలు విధించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టడం, పట్టణంలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చే లక్ష్యంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయా, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారా, పారిశుధ్య నిర్వహణ ఎలా ఉందనే అంశాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తున్న దుకాణాలు, పారిశుధ్య లోపాలు ఉన్న హోటళ్లతో కలిపి 8 వ్యాపార సంస్థలకు రూ.36,500 జరిమానా విధించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శ్రీ బాలాజీ ట్రేడర్స్, మల్లికార్జున ప్లాస్టిక్, అయ్యప్ప పేపర్ ప్లేట్స్, శ్రీ విజయదుర్గ వైన్స్, వీరేశం ట్రేడర్స్, గణపతి మెడికల్, వాసవి కిరాణం, శ్రీ బాలాజీ కిరాణం, లక్కీ బేకరీ, సాయి శ్రీనివాస కిరాణం, బాలాజీ రమేశ్వర్ స్వీట్స్, అభిరుచి దాబా, అగ్ర మిఠాయి బండార్, మైత్రి రెస్టారెంట్ తదితర వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి. యాదగిరి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధమని తెలిపారు. వ్యాపారులు ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగించాలని సూచించారు. ప్రతి వ్యాపార సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, గడువు ముగిసిన వారు వెంటనే రెన్యూవల్ చేసుకోవాలని ఆదేశించారు. కొన్ని హోటళ్లలో పారిశుధ్య పరిస్థితులు సరిగా లేవని, వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భవిష్యత్‌లో దుకాణాలు, వ్యాపార సంస్థలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్లు నరేందర్, ఉమేందర్ సింగ్, వెంకటేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితుల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీశైలం

లబ్ధిదారునికి సీఎంఆర్ చెక్కు అందజేత



**యాచారం, జూన్ 19 (ప్రజాజ్యోతి):** అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత భరోసాగా నిలుస్తుందని మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీశైలం అన్నారు. మల్కీజుగూడాకు చెందిన వరికుప్పల శంకరయ్య అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సహకారంతో శంకరయ్యకు రూ. 54 వేల చెక్కు మంజూరయింది. చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్న అనారోగ్య బాధితులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా భరోసా ఇవ్వాలన్నా ఉద్దేశంతోనే ఆర్థిక సహాయాన్ని అందజేస్తుందని శ్రీశైలం తెలిపారు. అనారోగ్య బాధితుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన నిరుపేదలంతా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నాయకులు గౌరారం వెంకట్ రెడ్డి, చీర శేఖర్, వరికుప్పల యాదయ్య, వార్డు సభ్యులు బోడ మధు, చీర మహేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాశం జయ ప్రకాష్, ఉప సర్పంచ్ దేంది మధుకర్, వరికుప్పల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో మొక్కలు నాటి సంరక్షించాలి

-----అలియాబాద్ మున్సిపల్ ఛైర్పర్సన్ కంఠం శిరీష కృష్ణా రెడ్డి





**శామీర్ పేట్, జూన్ 19,(ప్రజాజ్యోతి)** పర్యావరణ పరిరక్షణ కు ప్రతీ ఒక్కరూ పాటు పడాలని అలియాబాద్ మున్సిపాలిటీ ఛైర్పర్సన్ కంఠం శిరీష కృష్ణా రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో అలియాబాద్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి,వార్డు కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణం సమతుల్యంగా ఉండాలంటే సరైన సమయంలో వర్షాలు పడాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి, అలియాబాద్ మున్సిపాలిటీ, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# యువతను శక్తివంతం చేద్దాం భారతాన్ని అభివృద్ధి చేసుకుందాం

**- బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్.**



**తలకొండపల్లి,జూన్19 (ప్రజాజ్యోతి)** నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగే నమో జన్ జడ్ యువ కాన్‌క్లేవ్ సమావేశానికి తలకొండపల్లి మండలం నుండి శుక్రవారం బీజేవైఎం యువ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్ ముదిరాజ్ మాట్లాడుతూ...దేశ అభివృద్ధిలో యువతశక్తితో పాటు వారి పాత్ర ఎంతో ఉందని అన్నారు. యువతకు మార్గదర్శకంగా నిలిచే ఈ కాన్‌క్లేవ్ ద్వారా నాయకత్వ లక్షణాలు,నైపుణ్య అభివృద్ధి మరియు దేశ నిర్మాణంలో భాగస్వామ్యం వంటి తదితర అంశాలపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు. యువతను ప్రోత్సహిస్తూ,వారి ఆలోచనలు మరియు ఆకాంక్షలకు వేదికగా నిలిచే ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ తలకొండపల్లి మండలం నుండి ఉత్సాహంగా బీజేవైఎం నాయకులు బయలుదేరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్ ముదిరాజ్,బీజేవైఎం మండలం ఉప అధ్యక్షులు పుట్ట నాగారజు,ఎట్టి రాజు,ఇస్లావత్ వెంకటేష్,ఈసారి ప్రవీణ్,పద్మ శ్రీహరి,రొయ్యల గణేష్,శ్రీధర్,అనిల్,రమేష్, రాకేష్,కుమార్,మధుకర్,జగన్,బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# బిబిసి క్యాంపస్లోకి అక్రమంగా చొచ్చుకెళ్లిన జాబెల్ రెడ్డి మహిళా బౌన్సర్లు

- మాకు ఫేవర్ గా హైకోర్టు ఆదేశాలు ఉన్నాయి!
- అయినా ఇబ్బందులు తప్పడం లేదు
- జాబెల్ రెడ్డి తీరుపై బిబిసి బోర్డు సభ్యుల మండిపాటు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం
- బిబిసి అడ్మినిస్ట్రేటివ్ సభ్యుడు సెబాస్టిన్






**మేడ్చల్, జూన్ 19 (ప్రజాజ్యోతి):** బిబిసి క్యాంపస్లోకి జాబెల్ రెడ్డి రాకూడదని, స్థానిక పోలీసులు కూడా ఈ అంశంలో జోక్యం చేసుకోకూడదని తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ అయ్యాయని, వాటిని బేఖాతరు చేస్తూ కొందరు మహిళా బౌన్సర్లతో బిబిసి సెక్యూరిటీ సిబ్బందిని తోసేసి క్యాంపస్ లోకి వచ్చి జాబెల్ రెడ్డి దౌర్జన్యం చేస్తున్నారని బిబిసి బోర్డు అడ్మినిస్ట్రేటివ్ సభ్యుడు సెబాస్టియన్ ఆరోపించారు. శుక్రవారం బిబిసి అడ్మినిస్ట్రేటివ్ సభ్యుడు మీడియాతో మాట్లాడుతూ.. జాబెల్ రెడ్డి కొందరు మహిళా బౌన్సర్లతో బిబిసి క్యాంపస్ గేటు ముందుకు వచ్చి లోపటికి వచ్చి ప్రశాంతంగా కొనసాగుతున్న పాఠశాల తరగతులను ఇబ్బందికి గురి చేస్తారేమోనని డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. అక్కడికి వచ్చిన పోలీసు కానిస్టేబుళ్ళు ఎలాంటి సంబంధం లేకుండా ఇబ్బందికి గురి చేసే వారిని అక్కడి నుండి పంపించేయకుండా పాఠశాల ప్రిన్సిపల్ రూబెన్ ను పంపించాలని, అప్పుడే బయట ఉన్న జాబెల్ రెడ్డి అలాగే వారితో వచ్చిన మహిళా భవన్ సార్లని కూడా పంపించేస్తామని చెప్పడం విచిత్రమని అసహనం వ్యక్తం చేశారు. 60 సంవత్సరాలు పైబడిన వారు హెడ్మాస్టర్ గా ఉండకూడదని విద్యాశాఖ అధికారులు చెప్పినప్పటికీ జాబెల్ రెడ్డి దౌర్జన్యంగా తమకు సంబంధించిన ఓ వృద్ధ మహిళ హెడ్మాస్టర్ ను క్యాంపస్లోకి తీసుకొచ్చి ఆఫీస్ రూమ్ లో కూర్చోబెట్టడం అనధికామని చెప్పుకొచ్చారు. అదును చూసుకొని సెక్యూరిటీని తోసేసి జాబెల్ రెడ్డికి సంబంధించిన పలువురు వ్యక్తులు, మహిళా బౌన్సర్లు బిబిసి ఆవరణలోకి అక్రమంగా చొచ్చుకొచ్చారని సెబాస్టియన్ చెప్పారు. హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన జాబెల్ రెడ్డిపై చట్టబద్ధంగా పోరాటం చేస్తామని అన్నారు. అధికార పార్టీకి సంబంధించిన ఓ ఎమ్మెల్యే అండదండలు చూసుకుని జాబెల్ రెడ్డి రెచ్చిపోతున్నారని సెబాస్టియన్ తెలిపారు. జాబెల్ రెడ్డి రాజకీయ పలుకుబడి ఉపయోగించి స్థానిక పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారని, అందుకారణంగానే పోలీసులు జాబెల్ రెడ్డికి సహకరిస్తున్నారని సెబాస్టియన్ ఆరోపించారు. బిబిసి ఆవరణలో ప్రశాంతంగా కొనసాగుతున్న నర్సరీన్ గ్రామర్ స్కూల్ తరగతులను జాబెల్ రెడ్డి భంగం కలిగించేందుకు ప్రయత్నించారని చెప్పారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం పోలీసులు తమకు సహకరించాలని సెబాస్టియన్ కోరారు. వివాదం ఇలాగే కొనసాగితే విద్యాశాఖ ఉన్నతాధికారులతోపాటు, పోలీసు ఉన్నతాధికారులకు జాబెల్ రెడ్డిపై ఫిర్యాదు చేస్తామన్నారు.

# సబిత ఇంద్రారెడ్డికి ఎమ్మెల్యే రంగారెడ్డి బహిరంగ లేఖ.!

పథకాలకు అర్హత కలిగి ఉంటే లబ్ధి పొందండి...
వాస్తవాలు తెలుసుకోవాలన్న ఎమ్మెల్యే రంగారెడ్డి
ఏవైనా సలహాలిచ్చినా, వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్తా..
సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న బహిరంగ లేఖ



**ఇబ్రహీంపట్నం జూన్ 19 ప్రజాజ్యోతి:** రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పథకాలు అమలుకావట్లేదని పదేపదే మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలంటూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, బహిరంగ లేఖ రాశారు. బహిరంగ లేఖ పొలిటికల్ సర్కిల్ లో హాట్ టాపిక్ గా మారి చర్చనీయాంశమైయ్యింది. సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. సబితా ఇంద్రారెడ్డిని వదినగా సంబోధిస్తూ..విడుదల చేసిన లేఖ ఆసక్తిగా ఉండడంతో ఇది సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి చేసిన విన్నపం... రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పథకాలు అమలు కావట్లేదని పదేపదే మాట్లాడుతున్న మా వదినమ్మ సబితా ఇంద్రారెడ్డికి బహిరంగ విన్నపం, ప్రభుత్వ పథకాలు అందడంలేదని ఇటీవల తరచుగా ఎక్కడికి వెళ్ళినా మీరు మాట్లాడుతున్నారు. అందుకు మన ప్రియతమ ముఖ్యమంత్రి, ఆడబిడ్డలందరికీ అన్నాతమ్ముడిగా రేవంత్ రెడ్డి పంపే 'చీర సారె' మీకూ పంపిస్తారు. వారు పంపించిన "ఇందిరమ్మ చీర" ధరించి, ఇంటి నుంచి బయలుదేరండి. బయటికి వచ్చి బస్సెక్కి మీరు కావాల్సిన చోట దిగండి. "మహాలక్ష్మి పథకం" కింద ఆధార్ కార్డు చూపిస్తే, బస్సులో మిమ్మల్ని ఒక్క రూపాయి ఎవరూ అడగరు. ఒక వేళ రేషన్ కార్డు ఉంటే బస్సు దిగగానే రేషన్ దుకాణానికి వెళ్ళండి. అక్కడ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందించే "సన్నబియ్యం" కూడా తీసుకోండి. అదే మార్గంలో మహిళా సంఘాలను కలవండి. అవసరమైతే అందులో చేరి, ఇందిరా మహిళా పథకం కింద ఒక్కో సంఘానికి వడ్డీ లేకుండా అందిస్తున్న "రూ. 10 లక్షల రుణ సదుపాయాన్ని" ఉపయోగించుకోవచ్చు. మీకు సంబంధించిన వారెవరైనా బిడ్డ పెళ్లి చేస్తే, "కళ్యాణలక్ష్మి" కింద అందిస్తున్న లక్ష 116 రూపాయల చెక్కు ఇప్పించండి. వారికి ఒక వేళ గృహవసతి లేని పక్షంలో ఇప్పటికే తొలివిడత పూర్తి అయినందున ఆ ఆడబిడ్డ పేరునే రానున్న రెండో విడత జాబితాలో "ఇందిరమ్మ ఇల్లు" ఇప్పించండి. సాయంత్రం ఇంటికి చేరాక "గృహజ్యోతి పథకం" కింద 200 యూనిట్ల వరకు అందుతున్న ఉచిత విద్యుత్ తో టీవీ, ఫ్యాన్ ఆన్ చేసి కాసేపు విశ్రాంతి తీసుకోండి. తర్వాత వంటగదిలో 'మహాలక్ష్మి' పథకం కింద 500 రూపాయలకే వస్తున్న ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ పై ఇష్టమైన వంటలు కూడా తయారు చేసుకునే అవకాశం ఉంటుంది.

**పథకాలకు అర్హత కలిగి ఉంటే లబ్ధి పొందండి...**

ఇలా పథకాల విషయంలో అవగాహన లేకున్నా, అనుమానం కలిగినా అక్కడికి వెళ్లి, స్వయంగా పరిశీలించి అర్హత కలిగి ఉంటే మీరూ లబ్ధిపొందండి. అప్పుడు రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయా లేదా అనే విషయంలో మీకు స్పష్టత వస్తుందని ఆశిస్తున్నాను. ఇవే కాకుండా ప్రజలకు మంచే చేసే విషయంలో మీరు ఇంకా ఏవైనా సలహాలిచ్చినా, వాటిని సీఎం దృష్టికి తీసుకువెళ్తామని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

# గట్టుఇప్పలపల్లిలో ప్రభుత్వ పాఠశాలకు పెరిగిన ఆదరణ

ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య
ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థుల అడుగుల
గట్టుఇప్పలపల్లిలో పడిపోతున్న ప్రైవేటు పాఠశాలల తీరు.
ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు




**తలకొండపల్లి,జూన్19 (ప్రజాజ్యోతి)** తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యా ప్రమాణాలు,క్రమశిక్షణ,విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన బోధన కారణంగా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది.ఇటీవల ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పలువురు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలపై విశ్వాసం ఉంచి జెడ్పీహెచ్ఎస్ గట్టు ఇప్పలపల్లి పాఠశాలలో చేరడం విశేషంగా ఆకర్షిస్తుంది.శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల బోధన విధానం,విద్యార్థుల ప్రతిభాభివృద్ధికి చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుబాటులో ఉందనే నమ్మకంతో తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య లభిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు.ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థుల మరికొందరు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు.ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను పొందవచ్చని,ప్రైవేటు పాఠశాలల పడిపోతున్న తీరు పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ..విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధే తమ లక్ష్యమని పేర్కొన్నారు.విద్యతో పాటు క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలు,నైతిక విలువలు,పోటీ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం కూడా అందిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతోందని,విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసుకోవడం అభినందనీయమని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జీనుకుంట్ల చంద్రశేఖర్,ఉప సర్పంచ్ అనితా విజయ్,వార్డు సభ్యులు రేణురెడ్డి,ముకురాల అశోక్ గౌడ్,ఆంజనేయులు గౌడ్,జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్,ఉపాద్యాయుల బృందం తదితరులు ఉన్నారు.

# దేశ భవితకు దిక్సూచి రాహుల్ గాంధీ

-----మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్
మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**శామీర్ పేట్, జూన్ 19,(ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ భవితకు దిక్సూచి అని, ఆయనను భావి భారత ప్రధానిగా చూడడమే యావత్ దేశ ప్రజల ఆకాంక్ష అని మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ అన్నారు. రాహుల్ గాంధీ 56 వ పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం మూడు చింతలపల్లి మండల కేంద్రంలో ఎంసీ పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.....రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్రలో వేలాది కిలోమీటర్లు పాదయాత్ర చేసి దేశాన్ని సంఘటిత శక్తిగా మార్చారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాపిరెడ్డి,కటికల శ్రీవాణి వైద్యనాథ్, దోసకాయ లతా వెంకటేష్, పెద్దిరెడ్డి శ్రీలత వెంకటరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బొమ్మలపల్లి మల్లేష్, పులి ప్రభాకర్, రాజిగళ్ల లతా , మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బండి జగన్నాథం, నాయకులు వేణుగోపాలరావు, జెర్రి పోతుల నర్సింలు, పట్టా బాల నరసింహ, రాజేంద్రప్రసాద్ గౌడ్, రాజిరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, కటికల గోపి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాల సన్నద్ధతపై సమన్వయ సమావేశంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్, జూన్19,( ప్రజా జ్యోతి )** వర్షాకాల సన్నద్ధతపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం (నాచారం సర్కిల్ )మల్లాపూర్ వార్డ్ కార్యాలయం లో నిర్వహించారు.ఈ సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్షాకాలం లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ వ్యవస్థ, నాలాల శుభ్రత, రోడ్ల మరమ్మతులు, నీటి నిల్వలు, విద్యుత్ సరఫరా, తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.అన్ని లైన్ డిపార్ట్మెంట్ల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, వర్షాల కారణంగా తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందించి, అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొని వర్షాకాల సన్నద్ధతకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీ నిత్యానంద్ , ఈ ఈ రమేశ్ బాబు , వాటర్ వర్క్స్ డీజీమ్ వేణు గోపాల్ ,హైడ్రా అధికారులు అన్ని శాఖల అధికారులు బి ఆర్ ఎస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ , బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక విద్యకు జోయాలుకాస్ ప్రత్యేక కిట్స్ పంపిణీ

ముఖ్యఅతిథిగా హబ్సిగూడ మాజీ కార్పొరేటర్ కక్కిరేడి చేతన హరీష్




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఉప్పల్, జూన్ 19,(ప్రజా జ్యోతి):** హబ్సిగూడ, ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు జోయాలుక్కాస్ జ్యువెలరీ (స్ట్రీట్ నంబర్ 1, హబ్సిగూడ) ఒక ప్రశంసనీయమైన కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠశాల సామగ్రిని పంపిణీ చేశారు.

?ఈ కార్యక్రమం ద్వారా 1వ తరగతి నుండి 4వ తరగతి విద్యార్థులకు అవసరమైన పూర్తి కిట్లను అందజేశారు. ప్రతి కిట్లో బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, నోట్బుక్లు, గొడుగులు, వాటర్ బాటిళ్లు, లంచ్ బాక్సులు, కంపాక్స్ బాక్సులు ఇతర స్టేషనరీ వస్తువులతో కూడిన నిత్యావసర సామాగ్రిని అందించారు.?ఈ కార్యక్రమంలో హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ ,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ ,ఇంచార్జ్ ఉపేంద్ర జోయాలుక్కాస్ మేనేజర్ సుజిత్, రాజు, బిజెపి సీనియర్ నాయకులు సంజయ్ పటేల్, హబ్సిగూడ డివిజన్ ఓబిసి అధ్యక్షుడు అల్కాపురి సురేష్ పటేల్,పాల్గొని, చిన్నారులు తమ విద్యాభ్యాసంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రోత్సహించారు